పోరు తెలంగాణ
పత్రిక ప్రకటనల కోసం
మరియు
చందాదారులుగా
చేరండి చేర్పించండి
వివరాలకు
సంప్రదించండి సెల్
8555918136

# పోరు తెలంగాణ

డిజిటల్ తెలుగు దినపత్రిక




కరీంనగర్ సంపుటి : 11 సంచిక : 322 గురువారం 17-09-2026 ఎడిటర్ : కొండ ప్రవీణ్ కుమార్ పేజీలు : 04 వెల : 04

## పాకిస్థాన్‌లో అతిపెద్ద స్కామ్ మంత్రి నఖ్వీ వ్యాఖ్యలతో రాజకీయ ప్రకంపనలు!

- దేశ చరిత్రలోనే అతిపెద్ద స్కామ్‌ను బయటపెట్టానన్న పాక్ అంతర్గత మంత్రి
- 21 ఏళ్లుగా న్యాయమూర్తులు, నేతలు లంచాలు తీసుకున్నారని ఆరోపణ
- నఖ్వీ వ్యాఖ్యల వెనుక సైన్యాధిపతి అండ ఉందనే ఊహాగానాలు
- మంత్రివర్గ సహచరుడిపైనే పాక్ రక్షణ మంత్రి విమర్శలతో బయటపడ్డ విభేదాలు
- ప్రభుత్వాన్ని బలహీనపరుస్తున్నారంటూ నఖ్వీ రాజీనామాకు విపక్షాల డిమాండ్



పాకిస్థాన్ రాజకీయాల్లో తీవ్ర ప్రకంపనలు రేగాయి. దేశ చరిత్రలోనే అతిపెద్ద కుంభకోణాన్ని తాను బయటపెట్టినట్లు అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రి మొహ్సిన్ నఖ్వీ చేసిన వ్యాఖ్యలు అధికార వర్గాల్లోని విభేదాలను బట్టబయలు చేశాయి. న్యాయమూర్తులు, బ్యూరోక్రాట్లు, రాజకీయ నాయకులు, బ్యాంకర్లు ఈ స్కామ్‌లో భాగస్వాములుగా ఉన్నారని, గత 21 ఏళ్లుగా లంచాలు చేతులు మారాయని ఆయన ఆరోపించారు. ఈ వ్యాఖ్యల వెనుక సైన్యం, - మిగతా 2 లో

## ఇరాన్‌ను ఎలా ఒత్తిడికి గురిచేయాలి? కొత్త ఆలోచనలు కోరిన అమెరికా

- నిఘా విశ్లేషకులకు సెంట్‌కామ్ ఈ-మెయిల్
- వినూత్న ఆలోచనలు పంపాలని సూచన
- వైమానిక దాడులపై సందేహాలు
- భూగర్భ కేంద్రాలపై దాడి క్లిష్టమని అంచనా
- చర్చలకు ఇరాన్‌ను తీసుకురావడమే అమెరికా లక్ష్యం



## నియోజకవర్గానికైనా స్థానిక ఎమ్మెల్యేనే బాస్



- తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు
- 7 పేజీలతో నివేదికను పీసీసీ చీఫ్ కు అందించిన జగ్గారెడ్డి
- అందరి నుంచి అభిప్రాయాలను సేకరించి నివేదికను తయారు చేశామన్న జగ్గారెడ్డి

సూర్యాపేట జిల్లా తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న అంతర్గత - మిగతా 2 లో

## గోవాలో యూసీసీ అమలు చేయాలి

అమిత్ షాకు అసదుద్దీన్ సవాల్



- కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ఎంఐఎం అధినేత ఓవైసీ సవాల్
- విభిన్న సంస్కృతుల దేశంలో ఒకే చట్టం అసాధ్యమన్న ఓవైసీ
- రాజకీయ లబ్ధి కోసమే యూసీసీ అంటున్నారని ఆరోపణ

కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ సవాల్ విసిరారు. - మిగతా 2 లో

# నా పీఆర్ఓ, పీఏపై 15 మంది గూండాలు దాడి చేశారు

- సైఫాబాద్ పోలీస్ స్టేషన్ లో ముసుగులు ధరించిన వ్యక్తులు దాడికి పాల్పడ్డారన్న కేటీఆర్
- పీఎస్ బయట, లోపల ఉన్న సీసీటీవీ ఫుటేజీని భద్రపరచాలని డిమాండ్
- రేవంత్ పాలనతో తెలంగాణ రౌడీ రాజ్యంలా మారిందని మండిపాటు



2లో

హైదరాబాద్ లోని సైఫాబాద్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో తన పీఆర్ఓ మహేశ్ మాణిక్య, పీఏ మహేందర్ రెడ్డిపై దాడి చేశారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. యూనిఫాంలో

# నిరుద్యోగ సంక్షోభం మోదీ సర్కార్‌కు పెనుసవాల్

- పరీక్ష పత్రాల లీక్‌పై యువత ఆగ్రహం.. కేంద్ర మంత్రి రాజీనామా
- దేశంలో తీవ్రమవుతున్న నిరుద్యోగ సంక్షోభంపై నిపుణుల ఆందోళన
- విద్యా వ్యవస్థ వైఫల్యం, పడిపోతున్న ఉపాధి అవకాశాలు
- మోదీ సర్కార్‌కు దీర్ఘకాలిక సవాల్‌గా మారిన యువత అసంతృప్తి



పరీక్ష పత్రాల లీకేజీ ఉదంతాలపై దేశవ్యాప్తంగా యువత నిరసనలతో అట్టుడగడంతో, గత నెలలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పరిణామంతో మోదీ

## ఆలస్యం చేస్తే చాలా కష్టం



- జనన మరణాల నమోదుకు కొత్త రూల్స్.. పార్లమెంట్‌లో బిల్లుకు ఆమోదం!
- ఆలస్యంగా చేసే రిజిస్ట్రేషన్లకు కఠినమైన నిబంధనలు
- రెండేళ్లు దాటితే జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు అవసరం
- దేశంలో 99 శాతానికి పైగా పెరిగిన జనన, మరణాల నమోదు
- గుర్తింపు మోసాలను అరికట్టడమే లక్ష్యమని తెలిపిన కేంద్రం

దేశంలో జనన మరణాల నమోదు ప్రక్రియను మరింత పటిష్ఠం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం - మిగతా 2 లో

## అయోధ్య నిధుల కేసులో సాధువుల ప్రమేయం లేదు



- అయోధ్య నిధుల దుర్వినియోగం కేసులో సాధువుల ప్రమేయం లేదని వెల్లడి
- సిట్ ప్రాథమిక నివేదికలో ఈ విషయం స్పష్టమైందన్న ముఖ్యమంత్రి
- యూపీ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే విపక్షాల కుట్ర అని ఆరోపణ

అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి ఆలయ విరాళాల దుర్వినియోగం ఆరోపణల- మిగతా 2 లో

## 'అమరజీవి జలధార' గోదావరి జిల్లాల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



- జల్ జీవన్ మిషన్ కింద అమలవుతున్న 'అమరజీవి జలధార' ప్రాజెక్టు
- తీరప్రాంతాల్లోని 33 లక్షల మందికి సురక్షిత మంచినీటిని అందించడమే లక్ష్యం
- నిర్దేశిత వ్యవధిలోనే నిర్మాణాలను పూర్తి చేయాలన్న పవన్

జల్ జీవన్ మిషన్ కింద చేపడుతున్న 'అమరజీవి జలధార' ప్రాజెక్టు - మిగతా 2 లో

## నైతిక విలువలతోనే సంపూర్ణ విద్యా వికాసం

మంత్రి లోకేశ్‌తో చాగంటి కోటేశ్వరరావు



- విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో చాగంటి కోటేశ్వరరావు భేటీ
- నైతిక విలువలతో కూడిన విద్య ఆవశ్యకతపై కీలక చర్చ
- విద్యార్థులను బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- ప్రభుత్వ పాఠశాలల్లో నైతిక విలువల బోధనపై సమీక్ష

ప్రముఖ ప్రవచనకర్త, నైతిక విలువల సలహాదారు బ్రహ్మశ్రీ - మిగతా 2 లో

# వాళ్లది విధ్వంసం మాది పునర్నిర్మాణం

- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేసిన చంద్రబాబు
- గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం రూ.9.74 లక్షల కోట్ల అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్న సీఎం
- రెండేళ్లలో రూ.1.49 లక్షల కోట్ల సంక్షేమం, రూ.30,607 ఉద్యోగాలు అందించామని వెల్లడి
- అమరావతి, పోలవరం పూర్తి చేసి తీరతామని స్పష్టం చేసిన చంద్రబాబు
- విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రాలుగా ట్రిపుల్ ఇంజన్ గ్రోత్ వ్యూహంతో సమగ్రాభివృద్ధి
- సంక్షేమం ఆగదు, అభివృద్ధీ ఆగదన్న చంద్రబాబు




ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితిపై ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం నాడు శ్వేతపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనను "విధ్వంసం"గా అభివర్ణిస్తూ, తమ ఎన్డీయే ప్రభుత్వం చేపడుతున్నది

## ‘అమరజీవి జలధార’ గోదావరి జిల్లాల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

మొదటిపేజీ తరువాయి – ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతుందని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. మంగళగిరిలోని తన క్యాంప్ కార్యాలయంలో ఈ ప్రాజెక్టు పనుల పురోగతిపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. తీరప్రాంతాల్లోని దాదాపు 33 లక్షల మంది ప్రజలకు సురక్షితమైన మంచినీటిని అందించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును రూపొందించినట్లు పవన్ వివరించారు. నిర్మాణ పనుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యత విషయంలో రాజీ పడకూడదని అధికారులకు స్పష్టం చేశారు. నిర్దేశిత వ్యవధిలోనే కీలక నిర్మాణాలను పూర్తి చేసి, ప్రాజెక్టును సాధ్యమైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. తీరప్రాంత ప్రజల తాగునీటి భద్రతను నిర్ధారించడంలో జల్ జీవన్ మిషన్ కీలక పాత్ర పోషిస్తోందని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం కొనియాడారు.

## నైతిక విలువలతోనే సంపూర్ణ విద్యా వికాసం

మొదటిపేజీ తరువాయి – చాగంటి కోటేశ్వరరావు మంగళవారం రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఉండవల్లిలోని మంత్రి నివాసంలో జరిగిన ఈ సమావేశంలో.. విద్యా వ్యవస్థలో నైతిక విలువల ప్రాముఖ్యత, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే అంశాలపై వీరిద్దరి మధ్య కీలక చర్చ జరిగింది. ఈ సందర్భంగా చాగంటి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యార్థులను సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దాలంటే నైతిక విలువలతో కూడిన విద్య అందించడం ఎంతో కీలకమని అభిప్రాయపడ్డారు. చిన్నతనం నుంచే పిల్లల్లో మానవతా విలువలు, క్రమశిక్షణ, నైతికత వంటి గుణాలను పెంపొందించాల్సిన అవసరాన్ని ఆయన మంత్రికి వివరించారు. కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా, సంపూర్ణ వికాసం దిశగా విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో చాగంటి కోటేశ్వరరావు దిశానిర్దేశంలో రూపొందించిన నైతిక విలువల పాఠ్యాంశాలను ‘నో బ్యాగ్ డే’ రోజున బోధిస్తున్న సంగతి తెలిసిందే. నైతిక విలువలతో కూడిన విద్య ద్వారానే సమగ్ర విద్యా వికాసం సాధ్యమని నమ్మిన ప్రభుత్వం చేస్తున్న కృషిలో భాగస్వామి కావడం పట్ల చాగంటి సంతోషం వ్యక్తం చేశారు. భేటీ ముగిసిన అనంతరం మంత్రి లోకేశ్ స్వయంగా చాగంటి గారిని కారు వద్దకు వచ్చి వినయపూర్వకంగా సాగనంపారు.

## నియోజకవర్గానికైనా స్థానిక ఎమ్మెల్యేనే బాస్

మొదటిపేజీ తరువాయి – విభేదాలు, వర్గపోరు అంశంపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, పార్టీ పరిశీలకుడు జగ్గారెడ్డి తన సమగ్ర నివేదికను సిద్ధం చేశారు. మొత్తం 7 పేజీలతో కూడిన ఈ రిపోర్టును సీల్డ్ కవర్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు ఆయన అందజేశారు. తుంగతుర్తి నియోజకవర్గంలో ఇటీవల చోటుచేసుకున్న ఘర్షణలు, వర్గ విభేదాలపై గత పది రోజుల పాటు క్షేత్రస్థాయిలో పర్యటించి ఇరువర్గాలు, స్థానిక నాయకులు, కార్యకర్తల నుంచి అభిప్రాయాలను సేకరించినట్లు జగ్గారెడ్డి తెలిపారు. ఆ వివరాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఈ నివేదికను రూపొందించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన... ఏ నియోజకవర్గానికైనా స్థానిక ఎమ్మెల్యేనే ‘ఫస్ట్ బాస్’ అని, ఆ తర్వాతి స్థానంలోనే ఎంపీ, మంత్రులు ఉంటారని స్పష్టం చేశారు. అలాగే మూడో ప్రాధాన్యత డీసీసీ అధ్యక్షుడికి ఉంటుందని వ్యాఖ్యానించారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి సంబంధించిన వివాదాలు, ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలను కూడా ఈ నివేదికలో పొందుపరిచామని చెప్పారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీకి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలు ప్రధాన స్తంభాలని ఈ సందర్భంగా జగ్గారెడ్డి పేర్కొన్నారు.

## హైదరాబాద్ కు భారీ వర్ష సూచన.. ఎల్లో అలర్ట్ జారీ

మొదటిపేజీ తరువాయి – లేకుండా కురుస్తున్నాయి. వీటి ప్రభావంతో నేడు హైదరాబాద్ నగరం వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు నగర ప్రజలను అప్రమత్తం చేస్తూ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఆకాశం రోజంతా మేఘావృతమై ఉంటుందని, పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నిన్న హైదరాబాద్‌తో పాటు ఉత్తర తెలంగాణ జిల్లాల్లో కుండపోత వర్షం ముంచెత్తింది. గడిచిన 24 గంటల్లో కామారెడ్డి జిల్లాలో అత్యధికంగా 18.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా... వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లోనూ భారీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. రోడ్లపైకి వస్తున్న వాహనదారులు, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## ఆలస్యం చేస్తే చాలా కష్టం

మొదటిపేజీ తరువాయి – ప్రతిపాదించిన కీలక బిల్లుకు పార్లమెంట్ ఆమోద ముద్ర వేసింది. జనన మరణాల నమోదు (సవరణ) బిల్లు–2026కు మంగళవారం రాజ్యసభ ఆమోదం తెలిపింది. లోక్‌సభలో ఇదివరకే ఆమోదం పొందిన ఈ బిల్లు, త్వరలోనే చట్టరూపం దాల్చనుంది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. తాజా సవరణల ప్రకారం, జనన లేదా మరణ ధ్రువీకరణ పత్రాలను ఆలస్యంగా నమోదు చేయాలంటే కఠిన నిబంధనలు వర్తిస్తాయి. ఘటన (పుట్టిన లేదా మరణించిన) జరిగిన ఏడాది తర్వాత (రెండేళ్ల లోపు) నమోదు చేయాల్సి వస్తే జిల్లా మేజిస్ట్రేట్ లేదా సబ్–డివిజనల్ మేజిస్ట్రేట్ నుంచి ముందస్తు అనుమతి పొందడం తప్పనిసరి. ఒకవేళ రెండేళ్లు దాటిన పక్షంలో, ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు ఉంటేనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. ఈ సందర్భంగా మంత్రి నిత్యానంద రాయ్ మాట్లాడుతూ, జనన మరణాలను నిర్ణీత సమయంలోగా నమోదు చేయడాన్ని ప్రోత్సహించడంతో పాటు, తప్పుడు సమాచారం, అవకతవకలను అరికట్టడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 3.5 లక్షల రిజిస్ట్రేషన్ యూనిట్లు అందుబాటులో ఉన్నాయని, 2014లో 86.6 శాతంగా ఉన్న జననాల నమోదు 2024 నాటికి 99 శాతానికి పైగా చేరిందని ఆయన వివరించారు. అదేవిధంగా మరణాల నమోదు 72.5 శాతం నుంచి 99.4 శాతానికి పెరిగిందని మంత్రి వెల్లడించారు. బిల్లుపై జరిగిన చర్చలో భాగంగా బీజేపీ ఎంపీ దర్శన సింగ్ మాట్లాడుతూ, ఈ కొత్త సవరణలు వ్యవస్థను మరింత సరళంగా, పారదర్శకంగా మారుస్తాయని కొనియాడారు. అయితే, రెండేళ్ల తర్వాత జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌ను ఆశ్రయించాలనే నిబంధనపై బీజేడీ ఎంపీ డాక్టర్ సంతృప్త్ మిశ్రా కొంత ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఇప్పటికే పనిభారంతో ఉన్న న్యాయస్థానాలపై మరింత ఒత్తిడి పెంచుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. వైసీపీ, కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, బీఆర్ఎస్, అన్నాడీఎంకే సహా పలు పార్టీల సభ్యులు ఈ బిల్లుకు మద్దతు తెలిపారు.

## గోవాలో యూసీసీ అమలు చేయాలి



మొదటిపేజీ తరువాయి – 2029 నాటికి ఎన్డీయే పాలిత ప్రాంతాల్లో ఉమ్మడి పౌర స్మృతిని (యూసీసీ) అమలు చేస్తామని అమిత్ షా చేసిన ప్రకటనపై ఓవైసీ తీవ్రంగా స్పందించారు. “మీకు ధైర్యం ఉంటే, ముందుగా గోవాలో యూసీసీని అమలు చేయండి” అని ఆయన వ్యాఖ్యానించారు. భారతదేశం వంటి విభిన్న సంస్కృతులు, విలక్షణ సంప్రదాయాలు కలిగిన దేశంలో అందరికీ ఒకే రకమైన చట్టాన్ని రుద్దడం సాధ్యం కాదని ఓవైసీ అభిప్రాయపడ్డారు. యూసీసీని తీసుకురావడం వల్ల రాజ్యాంగం గిరిజనులు, మైనారిటీలు, ఇతర సామాజిక వర్గాలకు కల్పించిన హక్కులకు, రక్షణకు భంగం వాటిల్లుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసమే కేంద్ర ప్రభుత్వం ఇటువంటి సున్నితమైన అంశాలను తెరపైకి తెస్తోందని ఓవైసీ ఆరోపించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. గోవాలో ఇప్పటికే కాథలిక్కులు, ఇతర వర్గాలకు వ్యక్తిగత చట్టాల్లో మినహాయింపులు ఉన్నాయని గుర్తు చేసిన ఆయన, ఆ మినహాయింపులను తొలగించకుండా దేశవ్యాప్తంగా యూసీసీని ఎలా అమలు చేస్తారని ప్రభుత్వాన్ని నిలదీశారు.

# వాళ్లది విధ్వంసం, మాది పునర్నిర్మాణం

మొదటిపేజీ తరువాయి – “పునర్నిర్మాణం” అని స్పష్టం చేశారు. 2019 నుంచి 2024 మధ్య కాలంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పూర్తిగా నాశనం చేశారని, సంస్థలను నిర్వీర్యం చేసి, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని తీవ్ర స్థాయిలో విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన గత రెండేళ్లలో చేపట్టిన దిద్దుబాటు చర్యలు, భవిష్యత్ ప్రణాళికలను ఆయన సమగ్రంగా వివరించారు.

### గత ఐదేళ్లది విధ్వంసం.. మాది పునర్నిర్మాణం

2024 ఎన్నికల్లో ప్రజలు చారిత్రక తీర్పు ఇచ్చారని, ఇది ఒక నిశ్శబ్ద విప్లవం అని చంద్రబాబు అభివర్ణించారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో భయంకరమైన పరిస్థితులు నెలకొన్నాయని, స్వేచ్ఛగా మాట్లాడే పరిస్థితి కూడా లేదని అన్నారు. ప్రజావేదిక కూల్చివేతతో విధ్వంస పాలన ప్రారంభమైందని, అమరావతిని ఆపేసి, పోలవరాన్ని నిర్వీర్యం చేసి, పారిశ్రామికవేత్తలను తరిమికొట్టి “బ్రాండ్ ఆంధ్రప్రదేశ్”ను పూర్తిగా దెబ్బతీశారని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చాక ప్రధాని నరేంద్ర మోదీ, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సహకారంతో రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టేందుకు అనునిత్యం శ్రమిస్తున్నామని తెలిపారు.

### విభజన నష్టం కంటే విధ్వంసమే ఎక్కువ

2014లో రాష్ట్ర విభజన బాధాకరమైనప్పటికీ, 2019–24 మధ్య జరిగిన విధ్వంసం అంతకంటే భయంకరమైన మానసిక వేదనను మిగిల్చిందని చంద్రబాబు అన్నారు. విభజన సమయంలో 58% జనాభాకు 46% వనరులే వచ్చాయని, అయినా ఐదేళ్లలో కష్టపడి ఆర్థిక వ్యవస్థను ఒక దారికి తెచ్చామని గుర్తుచేశారు. కానీ, గత ప్రభుత్వం అన్ని వ్యవస్థలనూ నాశనం చేసిందని, అధికారుల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసి, రాష్ట్రాన్ని అగమ్యగోచర స్థితిలోకి నెట్టిందని విమర్శించారు.

### ఆర్థిక గమనం.. రాష్ట్రాల మధ్య వ్యత్యాసం

గత ప్రభుత్వ ఆర్థిక విధానాల వల్ల ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య తలసరి ఆదాయంలో వ్యత్యాసం విపరీతంగా పెరిగిపోయిందని చంద్రబాబు అంకెలతో సహా వివరించారు. “2014–15లో తెలంగాణ, ఏపీ మధ్య తలసరి ఆదాయ వ్యత్యాసం రూ.30,201గా ఉండేది. మా ఐదేళ్ల పాలనలో దాన్ని రూ.25,000కు తగ్గించగలిగాం. కానీ, 2019–24 మధ్య కాలంలో ఈ వ్యత్యాసం ఏకంగా రూ.1,06,854కు పెరిగిపోయింది. ఒకవేళ 2014–19 మధ్య సాధించిన 13.5% వృద్ధిరేటు కొనసాగి ఉంటే, రాష్ట్రానికి అదనంగా రూ.76,195 కోట్ల ఆదాయం వచ్చేది. అప్పుడు అప్పులు చేయాల్సిన అవసరం ఉండేది కాదు” అని ఆయన విశ్లేషించారు.

అప్పుల ఊబిలోంచి బయటపడేస్తున్నాం

గత ప్రభుత్వం రాష్ట్రాన్ని రూ.9.74 లక్షల కోట్ల అప్పుల ఊబిలో ముంచిందని, నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం ఏపీ ‘జీరో డెట్ సస్టైనబిలిటీ’ స్థితికి చేరిందని, అంటే అప్పు పుట్టని దుస్థితికి వచ్చిందని చంద్రబాబు తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక పెండింగ్‌లో ఉన్న రూ.48,616 కోట్ల బిల్లుల్లో ఇప్పటికే రూ.29,000 కోట్లకు పైగా చెల్లించామని, ఉద్యోగుల బకాయిలు రూ.30,849 కోట్లు క్లియర్ చేశామని వివరించారు. అధిక వడ్డీలకు తీసుకున్న రూ.50,000 కోట్ల విలువైన 370 రుణాలను పునఃసమీక్షించి (రీ–నెగోషియేట్), ఏటా రూ.1,100 కోట్ల చొప్పున మొత్తం రూ.8,269 కోట్ల ఆదా చేశామన్నారు. నిధులు పక్కదారి పట్టడంతో నిలిచిపోయిన 86 కేంద్ర ప్రాయోజిత పథకాలను పునరుద్ధరించి, రూ.29,890 కోట్లు డ్రా చేయగలిగామని తెలిపారు.

### సంక్షేమానికి పెద్దపీట.. అభివృద్ధికి బాటలు

ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, సంక్షేమ హామీలను నెరవేర్చడంలో వెనకడుగు వేయలేదని చంద్రబాబు స్పష్టం చేశారు. గత రెండేళ్లలో సంక్షేమ పథకాల కోసం రూ.1,49,401 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. ఎన్టీఆర్ భరోసా కింద రూ.68,296 కోట్లు, తల్లికి వందనం కింద రూ.20,210 కోట్లు, అన్నదాత సుఖీభవకు రూ.8,724 కోట్లు అందించామన్నారు. దీంతో పాటు, రెండేళ్లలో 30,607 ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని, ఇందులో 15,941 ఉపాధ్యాయ పోస్టులతో మెగా డీఎస్సీ చేపట్టామని గుర్తుచేశారు.

### 4, కుటుంబ సాధికారతతో పేదరిక నిర్మూలన

సంక్షేమం అంటే కేవలం డబ్బులు ఇవ్వడమే కాదని, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే తమ లక్ష్యమని చంద్రబాబు అన్నారు. ఇందుకోసం ‘కుటుంబ సాధికారత మిషన్’ ప్రారంభించామని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యానికి (ఙూూ) ప్రజల భాగస్వామ్యాన్ని (ూవశీజూశ్రీవ'ం ూఙుతీఅవతీంష్ట్రఱజూ) జోడించి ‘ూ4’ అనే నూతన విధానాన్ని ప్రవేశపెట్టామన్నారు. ‘మార్గదర్శి బంగారు కుటుంబం’ (వీడీఖ 10–20) పథకం కింద సమాజంలో ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉన్న 10% మంది, వెనుకబడిన 20% కుటుంబాలను దత్తత తీసుకుని వారిని ఆర్థికంగా పైకి తీసుకురావాలని పిలుపునిచ్చారు.

### అమరావతి, పోలవరం పూర్తి చేసి తీరతాం

అమరావతి ప్రజల రాజధాని అని, అది ఒక సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్టు అని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఫేజ్–1 పనుల కోసం ఇప్పటికే రూ.41,000 కోట్లకు పైగా నిధులు సమీకరించామని, త్వరలోనే పనులు వేగవంతం చేస్తామని తెలిపారు. అదేవిధంగా, రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును మార్చి నాటికి పూర్తిచేసి ప్రధానమంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తామని ప్రకటించారు. దీనికోసం రూ.12,157 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు.

### మూడు ప్రాంతాల సమగ్రాభివృద్ధికి ట్రిపుల్ ఇంజన్ వ్యూహం

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ‘డబుల్ ఇంజన్ సర్కార్ – ట్రిపుల్ ఇంజన్ గ్రోత్’ వ్యూహాన్ని అనుసరిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రాన్ని మూడు ఆర్థిక రీజియన్లుగా విభజించి అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించారు.

1. విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ (ఎఱు=): పోర్ట్ ఆధారిత తయారీ, గ్రీన్ హైడ్రోజన్, ఏఐ, డేటా సెంటర్ల హబ్‌గా అభివృద్ధి చేస్తారు. సుమారు రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులతో 10 లక్షల ఉద్యోగాలు లక్ష్యం.
2. అమరావతి ఎకనామిక్ రీజియన్ (ూఱు=): పరిపాలన, నాలెడ్జ్ క్యాపిటల్‌గా, ఏఐ, క్వాంటం, డేటా సెంటర్ల కేంద్రంగా తీర్చిదిద్దుతారు. రూ.6–8 లక్షల కోట్ల పెట్టుబడులు లక్ష్యం.
3. తిరుపతి ఎకనామిక్ రీజియన్ (ఱు=): స్పేస్, డిఫెన్స్, డ్రోన్, ఎలక్ట్రానిక్స్, రెన్యువబుల్ ఎనర్జీ హబ్‌గా అభివృద్ధి చేస్తారు. రూ.10–12 లక్షల కోట్ల పెట్టుబడులతో 10 లక్షల ఉద్యోగాలు లక్ష్యం.

### ముందున్న సవాళ్లు.. భవిష్యత్ ప్రణాళిక

రాష్ట్ర సొంత ఆదాయంలో 98% ఉద్యోగుల జీతభత్యాలకే సరిపోతోందని, ఇది కర్ణాటక (28%), తెలంగాణ (44%)తో పోలిస్తే చాలా అధికమని చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదాయాన్ని పెంచుకుంటూ, ఖర్చులను అదుపు చేస్తూ ఆర్థిక క్రమశిక్షణ పాటించాల్సిన అవసరం ఉందన్నారు. పిపిపి, వైబిలిటీ గ్యాప్ ఫండింగ్ (ఎ+ఖీ) ద్వారా మూలధన వ్యయాన్ని పెంచుతామని తెలిపారు. అంతిమంగా రాష్ట్రాన్ని ఆరోగ్యకరమైన, సంపన్నమైన, సంతోషకరమైన సమాజంగా తీర్చిదిద్ది, ‘స్వర్ణాంధ్ర విజన్ 2047’ సాధించడమే తమ ధ్యేయమని స్పష్టం చేశారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## కొత్త పింఛన్లకు గ్రీన్ సిగ్నల్ 2.25 లక్షల మంది అకౌంట్‌లోకి డబ్బులు

మొదటిపేజీ తరువాయి – పంపిణీని ఆగస్టు 15 నుంచి ప్రారంభించాలని నిర్ణయించారు. తొలి దశలో సుమారు 2.25 లక్షలకుపైగా అర్హులకు కొత్త పింఛన్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేస్తోంది. పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారికంగా ప్రారంభించనున్నారు. అదే సమయంలో జిల్లాల్లో ఇన్‌చార్జి మంత్రులు లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలను అందజేసేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. కార్యక్రమం సజావుగా జరిగేలా సంబంధిత శాఖలు ఇప్పటికే మార్గదర్శకాలను సిద్ధం చేశాయి. ప్రభుత్వ అంచనాల ప్రకారం రాష్ట్రంలో 2,25,599 మంది కొత్త అర్హులైన లబ్ధిదారులకు ఈ విడతలో పింఛన్లు మంజూరు కానున్నాయి. సామాజిక భద్రతను మరింత విస్తరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో ఒంటరి మహిళలు, వితంతువులు, వృద్ధులు, దివ్యాంగులు, చేనేత కార్మికులు, గీత కార్మికులు, బీడీ కార్మికులు, బీడీ రేకేదార్లు, హెచ్ఐవీ-ఏఆర్‌టీ బాధితులు, ఫైలేరియా రోగులు, డయాలసిస్ పేషెంట్లు సామాజిక భద్రత పింఛన్లు పొందుతున్నారు. వీరితో పాటు తలసేమియా మరియు సికిల్ సెల్ అనీమియా బాధితులను కూడా పింఛన్ పథకంలో చేర్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో కొత్తగా మరిన్ని వర్గాలకు ఈ పథకం ప్రయోజనం అందనున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త లబ్ధిదారుల చేర్పు ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటివరకు మొత్తం 1,23,625 మంది కొత్త లబ్ధిదారులకు పింఛన్లు మంజూరు చేసినట్లు ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇందులో 82,625 మంది వృద్ధాప్య పింఛన్, 19,044 మంది వితంతు పింఛన్, 13,830 మంది హెచ్ఐవీ-ఏఆర్‌టీ బాధితులు, 6,996 మంది డయాలసిస్ రోగులు, 982 మంది దివ్యాంగులు ఉన్నారు. తాజా ఆదేశాల నేపథ్యంలో అర్హుల గుర్తింపు ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. ఇటీవల నిర్వహించిన కుల గణన (సీపెక్ సర్వే) ద్వారా సేకరించిన సమాచారం, అలాగే స్వయం సహాయక మహిళా సంఘాలు (ూఎ+ం) అందించిన వివరాలను ఆధారంగా తీసుకుని లబ్ధిదారుల ఎంపిక చేపడుతున్నారు. ఈ ప్రక్రియను సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (ూఱు-ూ) అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

ఆగస్టు 15 నుండి ప్రారంభమయ్యే చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఎంతవరకు విజయవంతమవుతుంది?

- చాలా విజయవంతమవుతుంది
- మధ్యస్థంగా విజయవంతమవుతుంది
- తక్కువ విజయవంతమవుతుంది
- విజయవంతం కాదు

# నిరుద్యోగ సంక్షోభం మోదీ సర్కార్‌కు పెనుసవాల్

మొదటిపేజీ తరువాయి – ప్రభుత్వం తాత్కాలికంగా సంక్షోభం నుంచి గట్టెక్కినప్పటికీ, యువతలో పేరుకుపోతున్న అసంతృప్తి భవిష్యత్తులో ప్రభుత్వానికి దీర్ఘకాలిక సవాల్‌గా మారనుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ మేరకు అంతర్జాతీయ వార్తా సంస్థ బీబీసీ ఓ కథనం వెలువరించింది. లీకేజీ కేసుల విచారణ నిమిత్తం ఫాస్ట్-ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తామని, పరీక్షా వ్యవస్థలో సంస్కరణల కోసం టెక్ నిపుణుడు నందన్ నీలేకని నేతృత్వంలో కమిటీని నియమిస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. అయినప్పటికీ, తగిన ఉపాధి అవకాశాలు కల్పనలోనూ, ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యంతో కూడిన విద్యను అందించడంలోనూ విఫలమవుతున్న ప్రస్తుత వ్యవస్థపై యువతలో అసహనం పెరుగుతోంది. వారి ఆందోళనలను నివృత్తి చేయడానికి ప్రభుత్వం మరింత నిర్మాణాత్మకమైన ప్రయత్నాలు చేయాల్సి ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రముఖ ఆర్థికవేత్త సంతోష్ మెహ్రోత్రా బీబీసీతో మాట్లాడుతూ, “గత దశాబ్ద కాలంలో కార్మిక మార్కెట్ స్థితిగతులు క్షీణించాయి. వ్యవసాయేతర ఉద్యోగాల సృష్టి మందగించడంతో పాటు, వాస్తవ వేతనాలు కూడా స్తంభించిపోయాయి” అని వెల్లడించారు. బలహీనమైన ఆర్థిక వ్యవస్థ వల్ల ఉద్యోగాలకు గిరాకీ పెరగడం లేదని, మరోవైపు మన విద్యా వ్యవస్థ సైతం నాణ్యమైన మానవ వనరులను అందించడంలోవెనుకబడి ఉందని ఆయన విశ్లేషించారు. అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ ‘స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా 2026’ నివేదిక ప్రకారం, ప్రస్తుతం పట్టభద్రుల్లో నిరుద్యోగిత రేటు గత 25 ఏళ్ల నాటి తరహాలోనే 35–40 శాతం వద్ద కొనసాగుతోంది. అయితే, పెరిగిన జనాభా దృష్ట్యా సమస్య తీవ్రత మరింత అధికంగా కనిపిస్తోంది. 2023 నాటికి 67 శాతం మంది గ్రాడ్యుయేట్లకు సరైన ఉపాధి లేదని ఈ నివేదిక స్పష్టం చేసింది. అదేవిధంగా, జీడీపీలో తయారీ రంగం వాటా 17 శాతం నుంచి 14 శాతానికి తగ్గడం, కృత్రిమ మేధ (ఏఐ) రాకతో ఐటీ రంగంలో నియామకాలు మందగించడం ఈ సంక్షోభాన్ని మరింత జఠిలం చేస్తున్నాయి. కేవలం ఏసీ కార్యాలయాల్లోని ఉద్యోగాలనే ఆశించకుండా, నైపుణ్యం ఆధారిత వృత్తులైన ప్లంబింగ్, ఎలక్ట్రీషియన్ వంటి పనులను కూడా చేపట్టేందుకు యువత సిద్ధపడాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుత యువత తమ తల్లిదండ్రుల కంటే మెరుగైన జీవన ప్రమాణాలను పొందలేని పరిస్థితులు నెలకొన్నాయని, ఇది దేశానికి పెను ముప్పుగా పరిణమించకుండా మోదీ ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని మార్కెట్ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## పాకిస్థాన్‌లో అతిపెద్ద స్కామ్.. మంత్రి నఖ్వీ వ్యాఖ్యలతో రాజకీయ ప్రకంపనలు!



మొదటిపేజీ తరువాయి – పౌర ప్రభుత్వానికి మధ్య పెరుగుతున్న ఘర్షణ వాతావరణమే కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. విలేకరులతో మాట్లాడుతూ.. ఈ కుంభకోణంలో బాధ్యులైన ప్రతి ఒక్కరిపై కఠిన చర్యలు తీసుకుంటామని నఖ్వీ హెచ్చరించారు. అయితే, ఆయన ఎవరి పేర్లనూ బయటపెట్టలేదు. కొద్ది రోజుల క్రితం కూడా ఆయన పాకిస్థాన్ పాలనా వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోయిందని వ్యాఖ్యానించారు. ఇది పౌర ప్రభుత్వంపై చేసిన విమర్శలుగానే అందరూ భావించారు. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఛైర్మన్‌గా కూడా ఉన్న నఖ్వీకి, ఆ దేశ సైన్యాధిపతి ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరుంది. ఆయన చేసిన ఆరోపణలు పౌర సంస్థలను లక్ష్యంగా చేసుకున్నవే తప్ప, సైన్యం ప్రస్తావన ఎక్కడా లేకపోవడం గమనార్హం. నఖ్వీ వ్యాఖ్యలపై ప్రభుత్వంలోనే వ్యతిరేకత వ్యక్తమైంది. రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్, నఖ్వీపై బహిరంగంగా విమర్శలు గుప్పించారు. ఆయన కేబినెట్, పార్లమెంట్ సమావేశాలకు సరిగా హాజరు కావడం లేదని, ముందు తన సొంత మంత్రిత్వ శాఖ, పీసీబీలో సంస్కరణలు చేపట్టాలని చురకలు అంటించారు. మరోవైపు నఖ్వీ వ్యాఖ్యలు ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచేలా ఉన్నాయంటూ ‘పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ’ (పీపీపీ) ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. ప్రాంతీయ దౌత్య వ్యవహారాల్లో, ముఖ్యంగా ఇరాన్‌తో మధ్యవర్తిత్వ చర్చల్లో నఖ్వీ ప్రత్యేక ప్రతినిధిగా వ్యవహరించడం సైనిక నాయకత్వంతో ఆయనకున్న సాన్నిహిత్యాన్ని సూచిస్తోంది. ప్రస్తుత పరిణామాలు అధికార వర్గాల్లోని తీవ్ర విభేదాలను సూచిస్తున్నాయా? లేక అంతర్గత ఒత్తిడి వ్యూహాల్లో భాగమా? అనే దానిపై పాక్ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది.

## నా పీఆర్ఓ, పీఏపై 15 మంది గూండాలు దాడి చేశారు



మొదటిపేజీ తరువాయి – ఉన్న పోలీసు అధికారుల సమక్షంలోనే ముసుగులు ధరించిన 15 మంది గుండాలు లోపలికి చొరబడి పక్కా ప్రణాళికతో ఈ దాడికి పాల్పడ్డారని... రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ వైఫల్యానికి ఇది నిదర్శనమని అన్నారు. ముఖ్యమంత్రి, హోంమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణ రౌడీ రాజ్యంలా మారిందని, అణచివేతకు తలొగ్గని ప్రతీ పౌరుడికీ భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులే ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అసెంబ్లీ గేటు ఘటనకు సంబంధించి హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి ఉన్నప్పటికీ, రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే విచారణ పేరుతో ఉదయాన్నే స్టేషన్‌కు పిలిపించి చీకటి పడే వరకు కాలయాపన చేసి ఈ కుట్రకు తెరలేపారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ గుండాలు ఈ దాడికి పాల్పడ్డారా? లేక పోలీసులే మఫ్టీలో ముసుగులు వేసుకుని వచ్చారా? అనే దానిపై నిజాలు బయటకు రావాలంటే తక్షణమే సిట్టింగ్ జడ్జితో స్వతంత్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. స్టేషన్ లోపల, బయట ఉన్న సీసీటీవీ ఫుటేజీని వెంటనే భద్రపరచాలని, గాయపడిన తన సిబ్బందికి రక్షణ కల్పించి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఈ చర్యలను నిరసిస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ‘ఎక్స్’ వేదికగా ట్యాగ్ చేస్తూ ‘వెల్‌డన్ కాంగ్రెస్’ అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

# గొందిగూడెంలో ఇంటింటికీ పింఛన్ వెరిఫికేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ ముత్యాలరావు

లబ్ధిదారుల ఇళ్ల వద్దే చేయూత పింఛన్ పత్రాల పరిశీలన





**భద్రాద్రి కొత్తగూడెం,(పోరు తెలంగాణ–పినపాక నియోజకవర్గ ప్రతినిధి–వల్లెపోగు రాము) అశ్వాపురం సెప్టెంబర్–16 :** గొందిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో చేయూత పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల అర్హత పత్రాల పరిశీలన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. వెరిఫికేషన్ ఆఫీసర్,అశ్వాపురం ఎంపీడీవో ముత్యాలరావు దరఖాస్తుదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి లబ్ధిదారులను, వారు సమర్పించిన అర్హత పత్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గొందిగూడెం సర్పంచ్ తాటి వెంకటలక్ష్మి,ఉప సర్పంచ్ కే.గంగయ్య, పంచాయతీ కార్యదర్శి మధుసూదన్‌రావుతో పాటు మండల, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు.

# నేడు కొబ్బరికాయలు పూజా సామాగ్రి కి వేలం పాట

**మహేశ్వరం, సెప్టెంబర్ 16, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** నేడు గట్టుపల్లి లోని వీరాంజనేయ స్వామి దేవస్థానం వద్ద కొబ్బరికాయలు, పూజ సామాగ్రికి వేలం పాటను నిర్వహించడం జరుగుతుందని ఫౌండర్ ట్రస్టు చైర్మన్లు రఘు మారెడ్డి, ప్రభాకర్ రెడ్డి లు తెలిపారు. గురువారం ఉదయం 11 గంటలకు ఈవో శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కొబ్బరికాయలు, పూజా సామాగ్రి, పూలు, బొక్క గులాలు, గాజు లు, మణిహారం, స్వీట్ షాపులు, హోటల్ మొదలగు వాటికి వేలం పాటను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి గల పాటదారులు సకాలంలో విచ్చేసి వేలంపాటలో పాల్గొనాలని వారు ఒక ప్రకటనలో కోరారు.



# ఈవిఎం గోడౌన్ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**పోరు తెలంగాణ,ఖమ్మం, సెప్టెంబర్–16 :** త్రైమాసిక తనిఖీల్లో భాగంగా కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఈవిఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, రాజకీయ ప్రతినిధులతో కలిసి బుధవారం తనిఖీ చేశారు. ముందుగా ఈవిఎం గోడౌన్ సీల్ ను పరిశీలించి రాజకీయ ప్రతినిధులు, అధికారుల సమక్షంలో సీల్ తీసి లోపలికి వెళ్లి, ఈ.వి.ఎం., వి.వి.ప్యాట్లు ఉన్న గది లోపల పరిశీలన చేసి తిరిగి సీల్ వేయించారు. తనిఖీ రిజిస్టర్ లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. అలారం, ఫైర్ సేఫ్టీ పరికరాలు పరిశీలించారు. సీసీ కెమెరాల పని తీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సెక్యూరిటీ సిబ్బందికి తెలిపారు. ఎన్నికల సామాగ్రి భద్రత అత్యంత ముఖ్యమని, సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఎం.ఏ. రాజు, ఆర్ అండ్ బి డిఇ లఖన్ నాయక్, ఎన్నికల డిటి అన్సారీ, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి పసుమర్తి శ్రీనివాస్, బహుజన్ సమాజ్ పార్టీ ప్రతినిధి వేల్పుల రామయ్య, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి బి. వేణుగోపాల్, బిజెపి పార్టీ ప్రతినిధి వి. రాజేష్, సిపిఐ (ఎం) పార్టీ ప్రతినిధి ఆర్. ప్రకాష్, ఐఎన్ సి పార్టీ ప్రతినిధి అన్నెం గోపాల్ రావు, టిడిపి పార్టీ ప్రతినిధి పాలడుగు టిఆర్ కృష్ణప్రసాద్, అధికారులు, తదితరులు ఉన్నారు.

# కట్టుకున్న భర్తే కాలయముడు





**పోరు తెలంగాణ ప్రతినిధి // మెట్ పల్లి :** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో దారుణం చోటుచేసుకుంది. కట్టుకున్న భార్యపై భర్త.. మెడకు చున్నీ బిగించి ఆమెను ప్రాణాల్లేకుండా చేశాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...పట్టణంలో నివాసముంటున్న అన్నం నరేష్,లక్ష్మి( అంగన్వాడీ టీచర్ ) దంపతుల మధ్య గత కొంతకాలంగా కుటుంబ కలహాలు జరుగుతున్నాయని అన్నారు.నరేష్ కథలాపూర్ కరెంట్ సబ్‌స్టేషన్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడని,ఈ క్రమంలో బుధవారం ఉదయం ఇద్దరి మధ్య మరోసారి తీవ్ర వాగ్వాదం చెలరేగిందని స్థానికులు అన్నారు.గొడవ తీవ్రస్థాయికి చేరడంతో క్షణికావేశానికి లోనైన భర్త నరేష్,భార్య లక్ష్మి మెడకు చున్నీ గట్టిగా బిగించి ఊపిరాడకుండా చేసి హత్య చేసి పరారైనట్లు అనుమానిస్తున్నారు. స్థానికుల సమాచారంతో కోరుట్ల పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కోరుట్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.ఈ దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు.




# బీఆర్ఎస్ లోకి కాంగ్రెస్, బిజెపి నాయకులు

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో చేరిక..



**మహేశ్వరం, సెప్టెంబర్ 16, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** తుమ్మలూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్, బిజెపి నాయకులు బుధవారం బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కటికల శ్రీహరి ముదిరాజ్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ లో చేరారు. వీరి చేరికతో తుమ్మలూరు గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ కి మరింత బలం చేకూరిందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. పార్టీలో చేరిన వారికి ప్రతి ఒక్కరికి సముచితస్థానం కల్పించడం జరుగుతుందని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీలోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కావాలంటే బీఆర్ఎస్ పార్టీకి మద్దతు పలకాలని ఆమె కోరారు. పార్టీలో చేరిన వారు కాంగ్రెస్ పార్టీ వార్డ్ మెంబర్లు శివకుమార్ యాదవ్, మాజీ సర్పంచ్ గంట నర్సిరెడ్డి, వార్డు సభ్యులు మహేష్, శ్రీధర్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు అంజయ్య, పర్వతాలు, శేఖర్ గౌడ్, రాములు, లక్ష్మారెడ్డి నాయకులు రాజు, ఐలయ్య, వెంకటేష్, కొండల్, అనుగుల వెంకటేష్, జగదీష్, యాదయ్య, కృష్ణ, ప్రభాకర్, దశరథ ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గంట వెంకట్ రెడ్డి, రాజమోని రాజు, నరసింహ యాదవ్, తులసి రెడ్డి, బి. జంగయ్య, శ్రీనివాస్, సుభాష్, శేఖర్ పాల్గొన్నారు.

# పేదల వినాయక ఉత్సవాలకు అండగా అన్నదానంతో మానవత్వం చాటుతున్న వేములపల్లి కృష్ణార్జునరావు

సహకారనికి జయహో అంటున్న స్థానికం

**భద్రాద్రి కొత్తగూడెం,(పోరు తెలంగాణ–నియోజకవర్గ ప్రతినిధి–వల్లెపోగు రాము) అశ్వాపురం, సెప్టెంబర్ 16:–** వినాయక చవితి అంటే భక్తి మాత్రమే కాదు ఆకలితో ఉన్నవాడి కడుపు నింపడమే నిజమైన దైవసేవ అనే సందేశాన్ని ఆచరణలో చూపిస్తున్నారు వేములపల్లి కృష్ణార్జునరావు. అశ్వాపురంలోని ఎస్సీ కాలనీలో గత 20 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాలకు చేదోడువాదోడుగా నిలుస్తూ,పలుమార్లు అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తూ కాలనీ ప్రజల అభిమానం, మన్ననలు పొందుతున్నారు. 2026లో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో పూర్తిస్థాయి అన్నదాన కార్యక్రమాన్ని కృష్ణార్జునరావు గారే చేపట్టడం విశేషం. “అన్నదానం అంటే ఆకలి తీర్చడమే కాదు.. ఆప్యాయతను పంచడం. దేవుడికి పూజ చేసే చేతులతోనే మనిషికి అన్నం పెట్టినప్పుడే ఆ భక్తికి పరిపూర్ణత” అనే భావనతో ఆయన చేస్తున్న సేవను కాలనీ యువకులు అభినందిస్తున్నారు. ఈ సందర్భంగా వినాయక విగ్రహ దాతలుగా సహకరిస్తున్న రాపల్లి ప్రవీణ్––హన్సిక దంపతులు సెక్యూరిటీ ఆఫీసర్ లకు కూడా కాలనీ యువకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కులం,వర్గం అనే భేదాలు లేకుండా భక్తిని మానవత్వంతో ముడిపెట్టి.. ఆకలిగొన్నవారికి అన్నం పెట్టే సేవే నిజమైన గణనాథుని సేవ అని కృష్ణార్జునరావు అన్నదానం మరోసారి చాటిచెబుతోంది.



# అశ్వాపురంలో ఘనంగా వరల్డ్ బార్బర్స్ డే వేడుకలు

నాయి బ్రాహ్మణుల సేవలను గుర్తించి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి..

నాయి బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అరసవల్లి వెంకటేశ్వరరావు



**భద్రాద్రి కొత్తగూడెం, (పోరు తెలంగాణ నియోజకవర్గ ప్రతినిధి– వల్లెపోగు రాము) అశ్వాపురం, సెప్టెంబర్ 16:–** వరల్డ్ బార్బర్స్ డే సందర్భంగా అశ్వాపురం మెయిన్ రోడ్డులోని మమత బ్రదర్స్ హెయిర్ స్టైల్స్ షాప్ వద్ద నాయి బ్రాహ్మణ సేవా సంఘం అశ్వాపురం మండల కమిటీ ఆధ్వర్యంలో 5వ వరల్డ్ బార్బర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నాయి బ్రాహ్మణులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా, తొలుత నాయి బ్రాహ్మణుల ఆరాధ్య దైవం వైద్య నారాయణ ధన్వంతరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాయి బ్రాహ్మణ లోగోతో కూడిన మూడు రంగుల జెండాను అశ్వాపురంలో గత 50 ఏళ్లుగా బార్బర్ వృత్తిలో కొనసాగుతున్న సీనియర్ సంఘ నాయకులు చింతిర్యాల సీతారాములు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి అరసవల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. నాయి బ్రాహ్మణుల సేవలను ప్రభుత్వాలు గుర్తించి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తరతరాలుగా సమాజానికి అందిస్తున్న సేవలకు ఆర్థిక చేయూత అందించడంతో పాటు కులవృత్తిదారులకు రక్షణ కల్పించాలని కోరారు. 55 ఏళ్లు దాటిన నాయి బ్రాహ్మణ వృత్తిదారులకు ఆసరా పెన్షన్లు, మండల కేంద్రాల్లో కమ్యూనిటీ భవనాలు మంజూరు చేయాలని, వృత్తిలోకి కార్పొరేట్ శక్తుల ప్రవేశాన్ని నియంత్రించే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో తాటిపాముల ఐలయ్య, దడిగల కొండయ్య, మాదుగుల సమ్మయ్య, యాసాని వెంకటరమణతో పాటు సంఘ నాయకులు, సభ్యులు, మండలంలోని వివిధ గ్రామాల నాయి బ్రాహ్మణులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సిద్ధి వినాయక గణేష్ మండలి వద్ద 2వ రోజు అన్న ప్రసాద వితరణ





**పోరు తెలంగాణ మంచిర్యాల సెప్టెంబర్ 16 :** టీఎన్జీవో హౌసింగ్ సొసైటీ నస్పూర్ లో శ్రీ సిద్ధి వినాయక గణేష్ మండలి వద్ద టీఎన్జీవో హౌసింగ్ సొసైటీ కార్యదర్శి ఎండీ హబీబ్ హుస్సేన్ పుణ్య దంపతులచే 2 వ రోజు మహా అన్న దానం చేయడం జరిగినది. ఈ సందర్భంగా టీఎన్జీవో హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు గడియారం శ్రీహరి మాట్లాడుతూ టీఎన్జీవో హౌసింగ్ సొసైటీ కాలనీ నస్పూర్ లో శ్రీ సిద్ధి వినాయక గణేష్ మండలి వద్ద 2వ రోజు మహా అన్నదానం చేసిన ఎండీ హబీబ్ హుస్సేన్ పుణ్య దంపతులకు శ్రీ సిద్ధి వినాయకుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని తెలపడం జరిగినది. మరియు టీఎన్జీవో హౌసింగ్ కాలనీ శ్రీ సిద్ధి వినాయక మండలి లో నవరాత్రులను పురస్కరించుకొని ప్రతిరోజు మధ్యాహ్నం మహా అన్నదానం మరియు సాయంత్రం అల్పాహారం దాతల సహకారంతో ఏర్పాటు చేయడం జరిగినదని తెలిపారు. ఈ కార్యక్రమాలకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపడం జరిగినది.తదుపరి టీఎన్జీవో హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో మహా అన్నదానం చేసిన ఎండీ హబీబ్ హుస్సేన్ పుణ్య దంపతులకు సన్మానం మరియు ముఖ్య అతిథులుగా విచ్చేసిన మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ 10 వ డివిజన్ కార్పొరేటర్ రాచకొండ గోపాల్ రావు ని, 11వ డివిజన్ కార్పొరేటర్ల సుదమల్ల హరికృష్ణ ని మరియు ఆర్ అండ్ బి ఎస్ ఈ కె రాము ని డి ఈ రమేష్ ను ఘనంగా సన్మానం చేయడం జరిగినది. ఈ మహా అన్నదాన కార్యక్రమంలో టీఎన్జీవోస్ హౌసింగ్ సొసైటీ కార్యనిర్వాహక అధ్యక్ష కార్యదర్శులు గుండేటి యోగేశ్వర్, కస్తూరి నాగేశ్వర్ సైళ్ల మొండయ్య, టీఎన్జీవో హౌసింగ్ సొసైటీ నాయకులు పుప్పాల హనుమంత రావు, పొన్న మల్లయ్య, శ్రీపతి బాపురావు బొడ్డు శ్రావణ్ కుమార్, భూముల రామ్మోహన్ తిరుపతి రెడ్డి సునీత ఎన్. సత్యనారాయణ టి.తిరుపతి బెక్కం ఉషన్న టీఎన్జీవో కాలనీ నాయకులు,మహిళలు పాల్గొన్నారు.

# రైతాంగ హక్కుల కోసం పోరాట స్ఫూర్తిని కొనసాగించాలి

వెట్టి చాకిరీ నిర్మూల కోసం పోరాడిన తెలంగాణ సాయుధ పోరాట అమరవీరులకు సీపీఐ ఘన నివాళి.

**బూర్గంపహాడ్ సెప్టెంబర్ 16 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా సారపాక ప్రతిభవన్‌లో సీపీఐ మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 1946––1951 మధ్య సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అమరులైన వీరులకు నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు. నిజాం పాలనలో కొనసాగిన భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరీ, అక్రమ వసూళ్లు, రైతులపై అణచివేతకు వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగం సాగించిన పోరాటం చరిత్రలో కీలక అధ్యాయంగా నిలిచిందన్నారు. ఈ ఉద్యమంలో కమ్యూనిస్టు పార్టీ, రైతు సంఘాలు కీలక పాత్ర పోషించాయని తెలిపారు. సిపిఐ జిల్లా సమితి సభ్యుడు కామ్రేడ్ పేరాల శ్రీనివాస్ మాట్లాడుతూఆంధ్ర మహాసభను ప్రజా వేదికగా వినియోగించుకుని గ్రామీణ ప్రాంతాల్లో రైతులను సంఘటితం చేశామని, వెట్టిచాకిరీ నిర్మూలన, అక్రమ పన్నులు––వసూళ్లకు వ్యతిరేకత, భూమి సమస్య, రైతుల హక్కుల కోసం ప్రజలను సమీకరించామని ఆయన పేర్కొన్నారు. భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా విస్తృత రైతాంగ ఉద్యమాన్ని నిర్మించిన ఘనత కమ్యూనిస్టు ఉద్యమానికి ఉందన్నారు. ఉద్యమంలో మహిళలు కూడా గణనీయంగా పాల్గొన్నారని, గ్రామాల్లో ప్రజా సంఘాలు ఏర్పడి దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలను ఏకం చేశాయని చెప్పారు. పోరాటం ఉధృతమైన దశలో వేలాది గ్రామాలు ప్రభావితమయ్యాయని, భూమి పంపిణీ, వెట్టి నిర్మూలన, కూలీల కనీస వేతనాలు వంటి అంశాలు ముందుకు వచ్చాయని వివరించారు సిపిఐ మండల కార్యదర్శి సబ్కా నాగేశ్వరరావు మాట్లాడుతూ. నిజాం పాలనకు అనుకూలంగా పనిచేసిన రజాకార్లు, పోలీసుల అణచివేతకు రైతాంగం తీవ్ర ప్రతిఘటన కొనసాగించిందని తెలిపారు. 1948లో హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం అయిన అనంతరం కూడా కొంతకాలం రైతాంగ పోరాటం కొనసాగిందన్నారు. భూమి, రైతుల హక్కులు, వెట్టిచాకిరీ నిర్మూలన, సామాజిక న్యాయం వంటి అంశాలను తెలంగాణ రైతాంగ పోరాటం దేశవ్యాప్త రాజకీయ చర్చలోకి తీసుకువచ్చిందని పేర్కొన్నారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ రైతాంగ హక్కుల పరిరక్షణ కోసం పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి సబ్కం నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు పేరాల శ్రీనివాసరావు, సిద్దారపు సుబ్బారెడ్డి, వి.వి.బి.చారి, పాండవుల బిక్షం, బర్ల వెంకటేశ్వర్లు, గుగులోతు బీమా, ఏఐటీయూసీ నాయకులు ఎండి షాజీద్, జహీర్, వెంకట్‌రెడ్డి, వేణు, వహీద్ పాషా తదితరులు పాల్గొన్నారు.




# గ్రామపంచాయతీలను సందర్శించిన ఎంపీడీవో



**పోరు తెలంగాణ,మంచిర్యాల జిల్లా సెప్టెంబర్ 16 :** జైపూర్ మండలం, రామారావుపేట, టేకుమట్ల గ్రామ పంచాయతీల ను ఎంపీడీవో శ్రీపతి బాపు రావు ఆకస్మికంగా సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామాల్లో పింఛను కోసం వచ్చిన దరఖాస్తులో అర్హులను గుర్తించుటకు వెరిఫికేషన్ చేయడం జరిగింది, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించడం జరిగింది. ఇట్టి పర్యటనలో ఎంపీడీవో తో ఏవో సైదా , హౌసింగ్ ఏఈ కాంక్ష , సర్పంచ్ పులి రాజశేఖర్ , పంచాయతీ కార్యదర్శులు డి.రజిత, టి. శ్రీనివాస్, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

# బాలాపూర్ మహాగణపతి సేవలో స్పీకర్ గడ్డం ప్రసాద్



**మహేశ్వరం సెప్టెంబర్ 16, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** బాలాపూర్ లో ప్రసిద్ధిగాంచిన మహాగణపతిని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ ప్రజలు సుఖసంతోషాలతో, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆయన వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి, బడంగ్ పేట్ మాజీ మేయర్ చిగిరింత పారిజాత నరసింహారెడ్డి, నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏనుగు జంగారెడ్డి, అమరేందర్ రెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి





**పోరు తెలంగాణ మంచిర్యాల సెప్టెంబర్ 16 :** జైపూర్ మండలం కుందారం గ్రామం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ ఆకస్మికంగా సందర్శించి తగు సూచనలు ఆదేశాలు ఇవ్వడం జరిగింది ముఖ్యంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవలు జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు క్షయ వ్యాధి నియంత్రణలో భాగంగా తీసుకుంటున్న చర్యలు మాతా శిశు సంరక్షణ 100 శాతం గర్భవతుల నమోదు 100 శాతం టీకాలు అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించినారు అదేవిధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీకా నిలువలను వ్యాక్సిన్ నిలువలను పరిశీలించడము, అన్ని రకాల వ్యాక్సిన్లను అందుబాటులో ఉంచుకోవాలని ఒక సబ్ సెంటర్లో లేని వ్యాక్సిన్లను ప్రకృతి నుంచి తెచ్చుకొని వాడాలని ఆదేశించినారు ప్రతి ఆరోగ్య కేంద్రాలు ఉప కేంద్రాలలో సమయపాలన పాటించాలని ఆదేశించినారు ముఖ్యంగా వాతావరణంలో మార్పులు వలన జ్వరాలు ఇతర వ్యాధులు ప్రబలి అవకాశముంది కావున ముందస్తు చర్యలు చేపట్టాలని గ్రామపంచాయతీ సర్పంచులు మండల అధికారులతో సమన్వయం చేసుకుంటూ చర్యలు చేపట్టాలని ఆదేశించినారు ప్రభావిత గ్రామాలలో వైద్య శిబిరములను ఏర్పాటు చేయాలి అదేవిధంగా రెసిడెన్షియల్ పాఠశాలలు ఆశ్రమ పాఠశాలలు పాఠశాలలను సందర్శించి పిల్లలకు పరీక్షలు చేయాలని అవగాహన కలిగించాలని వైద్యులను ఆదేశించినారు ముఖ్యంగా ఈ వారంలో పోషణ అభియాన్ కార్యక్రమము మరియు ప్రపంచ రోగి భద్రత దినోత్సవాల సందర్భంగా రోగులు మరియు వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించడం జరిగినది ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు వైద్య సిబ్బంది ద్వారా అందిస్తున్న సేవల పైన సంతృప్తి వ్యక్తం చేసినారు అదేవిధంగా రోజువారీగా ఈ ఔషధి కార్యక్రమం మరియు టెలి మానస్ కార్యక్రమాలు మానసిక ఆరోగ్యం పైన అవగాహన కలిగించాలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న మహిళ ఆరోగ్య క్లినిక్లను పరిశీలించడం జరిగినది అన్ని రకాల అత్యవసర మందులు పాము కాటు కుక్క కాటు సంబంధించినది అందుబాటులో ఉంచుకోవాలి స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులతో సమన్వయం చేసుకుంటూ వైద్య సేవలను ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించినారు ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ హెచ్ఈఓ రాంబాబు వైద్యులు డాక్టర్ రవి భారతి జయమ్మ నాగమణి మక్బుల్ సాదిక్ రవి రఫీక్ పాల్గొన్నారు

# అంబేద్కర్‌పై అసత్య ప్రచారంపై చర్యలు తీసుకోవాలి

జిల్లా మాల మహానాడు సంఘం డిమాండ్




**బూర్గంపాడు, సెప్టెంబరు 16 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై దురుద్దేశపూర్వకంగా అసత్య ప్రచారం చేస్తూ, కల్పిత నాయకుడిగా చిత్రీకరిస్తూ పుస్తకం ప్రచురించిన అమర ప్రసాద్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బూర్గంపాడు ఎస్ఐ మేడా ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. జాతీయ మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు పల్లంటి రమేష్, కాంగ్రెస్ పార్టీ బీ–బ్లాక్ మహిళా అధ్యక్షురాలు బర్ల నాగమణి, జాతీయ మాల మహానాడు రాష్ట్ర సీనియర్ నాయకుడు కూరపాటి దాసు బుధవారం పోలీసులకు ఫిర్యాదు ను అందజేశారు. అంబేద్కర్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా అసత్యాలను ప్రచారం చేయడం ద్వారా ప్రజల్లో విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం జరుగుతోందని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. సంబంధిత పుస్తకంలోని అంశాలను పరిశీలించి, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# కల్యాణలక్ష్మి ,షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

ముగ్గురు లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన తహసీల్దార్ స్వప్న.




**కామారెడ్డి జిల్లా ప్రతి నిధి దోమకొండ సెప్టెంబర్ 16 (పోరు తెలంగాణ న్యూస్:) :** దోమకొండ మండల కేంద్రంలోని రైతు వేదికలో షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి పథకాల చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల తహసీల్దార్ (ఎమ్మార్వో) స్వప్న ముగ్గురు లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.ప్రభుత్వం అందిస్తున్న షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి పథకాల ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందుతోందని అధికారులు తెలిపారు. లబ్ధిదారులు ఈ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భూపాల్ రెడ్డి, ఉన్న లక్ష్మణ్, తిప్పాపురం రవి, రెవెన్యూ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# డిపిఓగ్రామ పంచాయతీ పనుల పరిశీలన




**బూర్గంపాడు సెప్టెంబర్ 16 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** బూర్గంపాడు మండల పరిధిలో ఉప్పుసాక గ్రామ పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి పనులను డీపీఓ అనూష ఎంపీ ఓరామకృష్ణ పంచాయతీ సెక్రటరీ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉప్పుసాక గ్రామ పంచాయతీ సర్పంచ్ శ్రీమతి వర్ష మంగమ్మ , ఉప సర్పంచ్ పొదెం సుధాకర్ వార్డు సభ్యులు, పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు వర్ష లక్ష్మయ్యతదితరులు పాల్గొన్నారు. ఉప్పుసాక గ్రామ అభివృద్ధే లక్ష్యంగా ప్రజలతో కలిసి పనిచేయలని డిపిఓ ఆదేశించారు

# మహేశ్వరంలో ఘనంగా ఉర్సు ఇ షరీఫ్ గ్రంధోత్సవం వేడుకలు



**మహేశ్వరం, సెప్టెంబర్ 16, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** మహేశ్వరం నియోజకవర్గం కేంద్రంలో హజరత్ సయ్యదినా కమల్ షావలి రహమతుల్లా అలై దర్గా ఉర్సు ఇ షరీఫ్ గ్రంధోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం జామా మజీద్ ఇమామ్ సయ్యద్ అహ్మద్ అలీ దర్గాలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గాకు గ్రంథము గిలాఫ్ చద్దర్ పువ్వులు సమర్పించి ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ప్రత్యేకంగా ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో దర్గా సేవకుడు మొహమ్మద్ సలీం ఖాన్, మహేశ్వరం మాజీ సర్పంచ్ మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ నియోజకవర్గం అధ్యక్షుడు వక్ఫ్ బోర్డు రంగారెడ్డి జిల్లా మాజీ చైర్మన్ మహమ్మద్ అబ్దుల్ సమీర్, మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు షేక్ హాజీ బాబా, ముస్లిం కమిటీ అధ్యక్షులు మహమ్మద్ అబ్దుల్ ఫరీద్, ఉపాధ్యక్షులు గ్రామపంచాయితీ వార్డు సభ్యుడు షేక్ ఆజామ్, మాజీ కో –ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఆదిల్ అలీ,గ్రామ పెద్దలు షేక్ అహ్మద్, మహమ్మద్ అబ్బాస్, మొహమ్మద్ ముస్తాక్ ఖాద్రి, మొహమ్మద్ అష్ఫాక్ ఖాదరి, సయ్యద్ ఫరీద్ ఖాద్రి, మహమ్మద్ అబ్దుల్లా, మహమ్మద్ సోహెల్, తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డి జిల్లా ఖరీఫ్ 2026-27 ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా

ముందస్తు చర్యలు చేపట్టాలి

జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్...



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 16.(పోరు తెలంగాణ న్యూస్:) :** కామారెడ్డి జిల్లాలో ఖరీఫ్ 2026–27 సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధ్యక్షతన బుధవారం కలెక్టరేట్‌లో సన్నద్ధత సమావేశం నిర్వహించారు. రానున్న కొనుగోలు సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 3,19,361 ఎకరాల్లో 7,10,661 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేయగా, అందులో 4,59,295 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని టీ జి ఎస్ సి ఎస్ ఎల్ ద్వారా కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు అధికారులు వివరించారు. నోటిఫై చేసిన ఏడు సన్న రకాల ధాన్యం రాకలు అక్టోబర్ 2026 రెండో వారంలో బాన్సువాడ, ఎల్లారెడ్డి, పిట్లం డివిజన్లలో, అనంతరం నవంబర్ మొదటి వారంలో కామారెడ్డి డివిజన్‌లో ప్రారంభమయ్యే అవకాశం ఉందని సమావేశంలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఐకేపీ, పిఎసిఎస్ ల ఆధ్వర్యంలో 414 ధాన్యం కొనుగోలు కేంద్రాలు (పీపీసీ లు) ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఎన్ ఆర్ ఎస్ సి సర్వే ఆధారంగా వరద ముప్పు ఉన్నట్లు గుర్తించిన 34 పీపీసీ లను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియ, నిబంధనలు, పి సి ఎస్ ఏ పి ప్రమాణాలపై అన్ని సొసైటీ సెక్రటరీలు, ఏపీఎం లు, పీపీసీ ఇన్‌చార్జీలకు సెప్టెంబర్ 22, 2026న శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లోని మౌలిక సదుపాయాలకు సంబంధించిన ఫొటోలను తప్పనిసరిగా వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా మాత్రమే అప్‌లోడ్ చేయాలని, నకిలీ లేదా డౌన్‌లోడ్ చేసిన ఫొటోలను అప్‌లోడ్ చేయడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన మౌలిక సదుపాయాలపై కూడా జిల్లా కలెక్టర్ సమీక్షించారు. అవసరమైన మేరకు ధాన్యం క్లీనర్లు, తేమ కొలిచే పరికరాలు, వెయింగ్ స్కేల్స్, హస్క్ రిమూవర్లు ఇప్పటికే సమకూర్చినట్లు అధికారులు తెలిపారు. అదనంగా అవసరమైన టార్పాలిన్లు, ఆటోమేటిక్ ప్యాడీ క్లీనర్లను త్వరితగతిన సమకూర్చాలని కలెక్టర్ ఆదేశించారు. ధాన్యం నిల్వ కోసం ఇప్పటివరకు సుమారు 70,000 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యాన్ని ఏఎంసి గోడౌన్లు, డిఫాల్ట్ రైస్ మిల్లులు, ఇతర ప్రాంతాల్లో గుర్తించినట్లు అధికారులు తెలిపారు. అదనంగా పొరుగు రాష్ట్రం కర్ణాటకలోని బీదర్ పరిసర ప్రాంతాల్లో కూడా ధాన్యం నిల్వకు అవసరమైన సౌకర్యాల ఏర్పాటుకు అవకాశాలను పరిశీలించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. గత సీజన్‌కు సంబంధించిన పాత గన్నీలను రైస్ మిల్లర్లు త్వరితగతిన తిరిగి అప్పగించాలని ఆదేశించారు. ధాన్యం రవాణాకు వినియోగించే వాహనాలన్నీ సెప్టెంబర్ 25, 2026లోపు జిపిఎస్ సదుపాయంతో సిద్ధంగా ఉండేలా రవాణా కాంట్రాక్టర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. గత రబీ 2025–26 సీజన్‌లో ఎదురైన జాప్యాలను దృష్టిలో ఉంచుకుని, ధాన్యం రాకలు ప్రారంభమయ్యే సమయానికి ముందుగానే అన్ని కొనుగోలు కేంద్రాల్లో తగిన సంఖ్యలో హమాలీలు అందుబాటులో ఉండేలా కొనుగోలు సంస్థలు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి జాప్యం, ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, శిక్షణ కలెక్టర్ రవితేజ, సివిల్ సప్లై అధికారి వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఓ దామోదర్ రెడ్డి, డీఎం శ్రీకాంత్, డీసీఓ రామ్మోహన్, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి, సంబంధిత జిల్లా అధికారులు, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఈవిఎం గోడౌన్ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్





**పోరు తెలంగాణ,ఖమ్మం, సెప్టెంబర్–16:** త్రైమాసిక తనిఖీల్లో భాగంగా కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఈవిఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, రాజకీయ ప్రతినిధులతో కలిసి బుధవారం తనిఖీ చేశారు. ముందుగా ఈవిఎం గోడౌన్ సీల్ ను పరిశీలించి రాజకీయ ప్రతినిధులు, అధికారుల సమక్షంలో సీల్ తీసి లోపలికి వెళ్లి, ఈ.వి.ఎం., వి.వి.ప్యాట్లు ఉన్న గది లోపల పరిశీలన చేసి తిరిగి సీల్ వేయించారు. తనిఖీ రిజిస్టర్ లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. అలారం, ఫైర్ సేఫ్టీ పరికరాలు పరిశీలించారు. సీసీ కెమెరాల పని తీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సెక్యూరిటీ సిబ్బందికి తెలిపారు. ఎన్నికల సామాగ్రి భద్రత అత్యంత ముఖ్యమని, సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఎం.ఏ. రాజు, ఆర్ అండ్ బి డిఇ లఖన్ నాయక్, ఎన్నికల డిటి అన్సారీ, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి పసుమర్తి శ్రీనివాస్, బహుజన్ సమాజ్ పార్టీ ప్రతినిధి వేల్పుల రామయ్య, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి బి. వేణుగోపాల్, బిజెపి పార్టీ ప్రతినిధి వి. రాజేష్, సిపిఐ (ఎం) పార్టీ ప్రతినిధి ఆర్. ప్రకాష్, ఐఎన్ సి పార్టీ ప్రతినిధి అన్నెం గోపాల్ రావు, టిడిపి పార్టీ ప్రతినిధి పాలడుగు టిఆర్ కృష్ణప్రసాద్, అధికారులు, తదితరులు ఉన్నారు.

# హమారా ప్రసాద్ పై దేశద్రోహం కేసు నమోదు చేయాలి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రూసేగం భూమయ్య మాదిగ



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 16( పోరు తెలంగాణ న్యూస్ ) :** కామారెడ్డి జిల్లా బాన్సువాడ డివిజన్ కేంద్రంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర ముందు ధర్నా నిర్వహించారు. హమారా ప్రసాద్ దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగిందనీ అమర ప్రసాద్ పైన దేశద్రోహం కేసు నమోదు చేసి వెంటనే అతని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వంలో దళిత ఎంపీలు ఎమ్మెల్యేలు ఉన్నారని వారు ఎమ్మెల్యేలు ఎంపీలు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్, రాసిన రాజ్యాంగం ద్వారానే పదవులు అనుభవిస్తున్నారని, అలాంటి మహనీయుని కించపరిచినట్టు మాట్లాడినటువంటి అమర ప్రసాద్ పైన దేశద్రోహం కేసు నమోదు చేసి వెంటనే అతనిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ రాష్ట్ర అధ్యక్షులు గంగారం ఎమ్మార్పీఎస్ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు రవీందర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రవి జిల్లా యువసేన అధ్యక్షులు రాజు జిల్లా ప్రధాన కార్యదర్శి వెండి యాదవరావు జిల్లా ప్రచార కార్యదర్శి రవి సీనియర్ నాయకులు మండల అధ్యక్షులు బలరాం అంజయ్య ఎమ్మార్పీఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కల్లడి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణి



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** అలూర్ మండలంలోని కల్లడి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సర్పంచ్ గంగోల్ల సుస్మిత, ప్రళయ్ తేజ్ హాజరై విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు.సర్పంచ్ మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు అందించేందుకు గ్రామ పంచాయతీ తరఫున సహకారం అందిస్తామని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడంతో పాటు, పాఠశాలల్లో మెరుగైన వాతావరణం కల్పించేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు కలిసి పనిచేయాలని సూచించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు తాను ఎల్లప్పుడూ ముందుంటానని సర్పంచ్ తెలిపారు.యూనిఫార్మ్‌లు అందుకోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,గ్రామ పంచాయతీ ప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నేషనల్ యూత్ క్లబ్ గణేష్ మండపాన్ని సందర్శించిన సీఐ నరేష్ ఎస్సై ప్రభాకర్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 16( పోరు తెలంగాణ న్యూస్ ) :** కామారెడ్డి జిల్లా దోమకొండ మండల కేంద్రంలో నేషనల్ యూత్ క్లబ్ గణేష్ మండపాన్ని సందర్శించిన సీఐ నరేష్ మండప యజమానులకు పలు సూచనలు తెలియజేశారు. అనంతరం సీఐ ను ఎస్సై ను మండప నాయకులు సన్మానించినరు. ఈ కార్యక్రమంలో నేషనల్ యూత్ క్లబ్ ఉపాధ్యక్షులు తీగల తిరుమల్ గౌడ్, కార్యదర్శి కుంచాల శివరాం, క్యాషియర్ పన్యాల బాల్రెడ్డి, శరత్ పంతులు, పున్న లక్ష్మణ్, అంకత్ నరసింహులు, శ్యాంసుందర్ గౌడపాల్గొన్నారు.

# నేత్రదాత రాజేశ్వరి

డాక్టర్ మెరుగు భీష్మ చారి ఆధ్వర్యంలో



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** పెద్దపెల్లి జిల్లా ఓదెల మండలం కొమిరె గ్రామ నివాసి నాగవెల్లి రాజేశ్వరి మరణించగా, వారి మనుమడు సదాశయ ఫౌండేషన్ ప్రతినిధి నిఖిల్ నేత్రదానంపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించగా ఒప్పుకోవడంతో,,వాసన్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ చందు సహకారంతో కార్నియాలు సేకరించి సికింద్రాబాద్ ఐ బ్యాంక్ పంపించారు ఇద్దరూ అంధులకు చూపును ప్రసాదించిన కుటుంబ సభ్యులు సదానందం - రమాదేవి,మానస-క్రాంతి, నిఖిల్ సోనియా లకుఅవగాహన కల్పించిన నిఖిల్ కు సర్పంచ్ గోలి లింగ రెడ్డి. ఉప సర్పంచ్ మూల సంపత్ రెడ్డి,సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి, ఓదెల ప్రతినిధులు డాక్టర్ వేణు,క్యాతం మల్లేశం, అల్లం సతీష్,మేరుగు సారంగం, ,డాక్టర్ ఇప్పనపల్లి వెంకటేశ్వర్లు, సంతోష్ ,నవీన్ అభినందనలు ధన్యవాదాలు తెలిపారు.

## పోచంపాడు తెలంగాణ రెసిడెన్షియల్ బాలుర కళాశాలలో ఆరోగ్య వైద్య శిబిరం



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** మెండోర మండలంలోని పోచంపాడ్ తెలంగాణ రెసిడెన్షియల్ బాలుర జూనియర్ కళాశాలలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు.ఈ ఆరోగ్య శిబిరంలో వైద్యాధికారి డా.మద్దుల రాకేష్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి,అనారోగ్యంతో ఉన్న విద్యార్థులకు అవసరమైన మందులను అందించారు. ముఖ్యంగా జ్వరం,జలుబు,చర్మ సంబంధిత వ్యాధులు,గాయాలు తదితర సమస్యలకు వైద్య సేవలు అందించారు.అనంతరం విద్యార్థులకు కాలానుగుణంగా వచ్చే వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత, తరచుగా చేతులు శుభ్రంగా కడుక్కోవడం,భోజనం ముందు మరియు మరుగుదొడ్డి ఉపయోగించిన తర్వాత చేతులు సబ్బుతో కడుక్కోవడం వంటి చేతుల పరిశుభ్రత అంశాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో డా. మద్దుల రాకేష్, హెల్త్ ఎడ్యుకేటర్ మురళి, ప్రిన్సిపాల్ మహిపాల్ రెడ్డి, నర్సింగ్ ఆఫీసర్ ఎత్మా తదితరులు పాల్గొన్నారు.విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని ఈ సందర్భంగా వైద్య సిబ్బంది సూచించారు.

# ముప్కాల్ ఉన్నత పాఠశాలలో ఘనంగా అష్టావధానం

విద్యార్థుల్లో సాహిత్య అభిరుచి పెంపొందించడమే లక్ష్యం

అష్టావధాన కార్యక్రమంలో పాల్గొన్న డీఈఓ అశోక్



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** ముప్కాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం రోజు అష్టావధాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా విద్యాధికారి అశోక్ హాజరయ్యారు. యువ అవధాని బానోత్ నితిన్ అష్టావధానం నిర్వహించి తన ప్రతిభతో విద్యార్థులు, ఉపాధ్యాయులను ఆకట్టుకున్నారు. సంచాలకులుగా పద్యకోకిల, అష్టావధాని డాక్టర్ బొచ్కర్ ఓం ప్రకాష్ వ్యవహరించారు. అప్రస్తుత ప్రసంగికుడిగా కోకిల నాగరాజు, నిషిద్ధాక్షరిగా నాగుపల్లి రాజేందర్, పురాణ పఠనంగా అహల్యాదేవి సైతం ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్నారు. అష్టావధాన కార్యక్రమంలో భాగంగా నితిన్, ధనుష్, నేహాశ్రీ, హాసిని, మానస, యశస్వి, ఎక్షిక, మనస్వి రాజ్‌బాల తదితర పాఠశాల విద్యార్థులు పృచ్ఛకులుగా వ్యవహరించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వివిధ సాహిత్య అంశాలపై ప్రశ్నలు, సమస్యలను అవధానికి అందించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి యం.గంగారాం, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ముప్కాల్ మండల కేంద్రంలో జూనియర్ బాలుర కబడ్డీ సెలక్షన్ ప్రారంభించిన టీజీఎండిసి చైర్మన్



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** ముప్కాల్ మండల కేంద్రంలోని భూదేవ్ ఇండోర్ స్టేడియంలో జూనియర్ బాలుర కబడ్డీ సెలక్షన్స్ ను బుధవారం టీజీఎండిసి చైర్మన్ ఈరవత్రి అనిల్ ప్రారంభించారు. ఆయన వెంట జిల్లా డిసిసి అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి ఉన్నారు.కబడ్డీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.గంగాధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ జరిగింది. సీనియర్ క్రీడాకారులు అనురాధ,అశోక్,గంగాధర్ క్రీడాను పర్యవేక్షించారు.ఈ ఎంపిక ప్రక్రియలో 22 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులకు శిక్షణ శిబిరం ఈ నెల 19 తేదీ నుండి 23 వరకు చేపట్టి ఫైనల్ సెలక్షన్స్ ఈ నెల 23న నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే ఈ నెల 26 నుండి 29 వరకు వేములవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో ఎంపికైన జిల్లా జట్టు పాల్గొంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముత్యం రెడ్డి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.గంగాధర్ రెడ్డి, ఎలేటి రాములు, జి.గంగారం మల్లారెడ్డి, ప్రశాంత్, సీనియర్ కబడ్డీ క్రీడాకారులు పీడీ రాజ్ కుమార్, పీఈటీ సాయిలు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# రేగళ్ల తండా ఆశ్రమ పాఠశాలలో కలెక్టర్ అంకిత్ ఆకస్మిక తనిఖీ

వసతి గృహంలో సౌకర్యాలు, ఆహార పదార్థాల నాణ్యతపై పరిశీలన





**కొత్తగూడెం సెప్టెంబర్ 16పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల తండాలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించిన కలెక్టర్, అక్కడ అపరిశుభ్రతతో పాటు చెత్త ఉండటాన్ని గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం పాఠశాలలోని ఎన్‌సీసీ కార్యాలయాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎన్‌సీసీలో ఉన్న విద్యార్థుల సంఖ్య, గత సంవత్సరం ఉత్తీర్ణత శాతం తదితర వివరాలను ఉపాధ్యాయులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాల మెరుగుదలకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. తదుపరి బాలుర వసతి గృహాన్ని పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు అందుతున్న వసతి, తాగునీరు, పారిశుద్ధ్యం, భోజనం తదితర సౌకర్యాలను పరిశీలించారు. కిచెన్ షెడ్, స్టోర్ రూమ్‌లను తనిఖీ చేసి నిల్వ ఉంచిన సరుకులు, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. కిచెన్‌లోని ఆర్వో వాటర్ ప్లాంట్ పనిచేయకపోవడాన్ని గమనించిన కలెక్టర్, అందుకు గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వెంటనే అవసరమైన మరమ్మతులు చేపట్టి ఆర్వో ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్, వారికి అందుతున్న సౌకర్యాలు, భోజనం, తాగునీరు తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు వడ్డిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను స్వయంగా పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతిరోజూ నాణ్యమైన, పౌష్టికాహారం అందేలా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. బుధవారం మెనూలో చికెన్ అందించాల్సి ఉన్నప్పటికీ విద్యార్థులకు వడ్డించిన భోజనంలో చికెన్ లేకపోవడాన్ని కలెక్టర్ గమనించి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం ఆహారం అందించడంలో నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేస్తూ, సంబంధిత వార్డెన్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల సంక్షేమం, ఆరోగ్యం విషయంలో అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు . ఈ తనిఖీల్లో కలెక్టర్ వెంట లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్ శిరీష, ఎంపీడీవో సుచిత్ర, ఉపాధ్యాయులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వేంపల్లి గ్రామంలో పాలక వర్గ సభ్యుల ప్రత్యేక సమావేశం



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** ముప్కాల్ మండలంలోని వేంపల్లి గ్రామ పంచాయతీలో ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మహేష్ యాదవ్,పాలక వర్గ సభ్యుల ఆద్వర్యంలో..వీధి దీపాలు,త్రాగు నీరు, డ్రైనేజీ వ్యవస్థ,దోమల నివారణ,గ్రామాభివృద్ధికి సంబంధించిన అభివృద్ధి పనులపై చర్చించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్,వార్డు సభ్యులు, కార్యదర్శి లత,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఓదెల లో నేడు విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 17న ఓదెల మండల కేంద్రంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సీతారామాలయంలో నాగవె ల్లి సందీప్ చార్యులు ప్రత్యేక పూజలతో విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్సై సనత్ రెడ్డి హాజరు కానున్నారు. దైవిక వాస్తుశిల్పి అయిన భగవాన్ విశ్వకర్మ గౌరవార్థం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు.

**విశ్వకర్మ జయంతి విశిష్టత , ప్రాముఖ్యత**

సృష్టికర్తగా పూజ: హిందూ పురాణాల ప్రకారం విశ్వకర్మను సకల కళలకు ఆదిదేవునిగా, ప్రపంచ సృష్టికర్తగా భావిస్తారు. పనిముట్ల పూజ: ఇంజనీర్లు, ఆర్కిటెక్టు, మెకానిక్కు, ఫ్యాక్టరీ కార్మికులు, చేతివృత్తుల వారు తమ పనిముట్లు, యంత్రాలను శుభ్రం చేసి ప్రత్యేకంగా పూజిస్తారు. కార్యక్రమానంతరం అన్న ప్రసాదన కార్యక్రమం నిర్వహించనున్నారు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరు.

# గణనాథునికి ఆత్రం సుగుణ ప్రత్యేక పూజలు

నియోజకవర్గం ఇంచార్జి శ్యాంనాయక్.....



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 16: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** ఆసిఫాబాద్ పట్టణంలోని బజార్‌వాడిలో శ్రీ సంఘ సేవ గణేష్ మండలి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథునికి డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ మంగళవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించింది. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించింది. వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరింది. గణేష్ ఉత్సవాల నిర్వహణకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందని, అనుమతి పొందిన గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపింది. గణేష్ మండలి సభ్యులు, భక్తులు సమన్వయంతో ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని కోరింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ఇంచార్జి శ్యాంనాయక్, గ్రంథాలయం చైర్మన్ అనిల్ కుమార్, వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ ఇరుకుల మంగ, కౌన్సిలర్లు, డిసిసి కార్యవర్గ సభ్యులు, మండల కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, శ్రీ సంఘ సేవ గణేష్ మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన చేయాలి

కలెక్టర్ కె.హరిత.....



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 16: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం గన్నారంలోని తెలంగాణ మైనారిటీ సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలను జిల్లా కలెక్టర్ కె.హరిత బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరు పట్టిక, వంటశాల, సరుకుల నిల్వ గది, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల్లో పఠనా సామర్థ్యాన్ని అంచనా వేసి, వారికి అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలని ఆదేశించారు. విద్యార్థులు వంద శాతం గురుకులంలో ఉండేలా ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. మెనూ ప్రకారం సకాలంలో పౌష్టికాహారం అందించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తూ సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు.

# వలియోద్దీన్ కుటుంబానికి 10వ తరగతి మిత్రుల ఆర్థిక సహాయం



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 16 జన్నారం:** తమ 10వ తరగతి మిత్రుడు వలియోద్దీన్ ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న మిత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించి, తమ వంతు మానవతా సహాయంగా ?42,500 ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మిత్రులు మాట్లాడుతూ, వలియోద్దీన్ మృతి తమను తీవ్రంగా కలచివేసిందని, ఆయన కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు అదేవిధంగా వలియోద్దీన్ చిన్న కుమార్తె విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకం కలగకుండా, ఆమె చదువు పూర్తయ్యే వరకు శ్రీకృష్ణవేణి పాఠశాలలో జన్నారం లో ఉచితంగా విద్యను అందిస్తామని హామీ ఇచ్చారు. మిత్రులు అందించిన ఈ సహాయాన్ని కుటుంబ సభ్యులు కృతజ్ఞతతో స్వీకరించారు. ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచిన 10వ తరగతి మిత్రుల మానవతా దృక్పథాన్ని పలువురు అభినందించారు.

# నిమజ్జన ప్రదేశాలలో పకడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్ కె.హరిత ఆదేశం....



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 16: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండల కేంద్రంలోని పెద్దవాగు వద్ద గల వినాయక విగ్రహాల నిమజ్జన ప్రదేశాన్ని జిల్లా కలెక్టర్ కె.హరిత బుధవారం కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ హర్మచౌదరి, డి.ఎస్.పి. వహీదుద్దీన్‌తో కలిసి పరిశీలించారు. నిమజ్జన ప్రదేశంలో అపస్మృతులు జరగకుండా ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా రహదారి మరమ్మత్తులు చేపట్టాలని, నిమజ్జన ప్రదేశంలోని మట్టిని చదును చేయాలని సూచించారు. విగ్రహాల సంఖ్యను బట్టి అదనపు క్రేన్లు అందుబాటులో ఉంచాలని, ఎక్కువ మంది సిబ్బందిని నియమించాలని, రహదారి, నిమజ్జన ప్రాంతంలో తగినంత వెలుతురు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా సాగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

# గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షించిన అధికారులు



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** బాల్కొండ మండల కేంద్రంలో గణేష్ నిమజ్జన ఏర్పాట్లను స్థానిక సర్పంచ్ గాండ్ల రాజేష్, స్థానిక ఎస్సై శైలేందర్ పరిశీలించారు. నిమజ్జన సమయంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా, శాంతియుతంగా జరిగేందుకు సన్నహాలు చేపట్టారు. విద్యుత్ సమస్యలు,గజ ఈతగాళ్ల ఏర్పాటు, ముండ్ల పొదలను తొలగించడం, వంటి సౌకర్యాలను గణేష్ నిమజ్జన్న నిర్వాహకులకు కల్పించేటట్లు తగిన చర్యలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, విద్యుత్ సిబ్బంది,పంచాయతీ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక అవసరాలు గల పిల్లల పట్ల ప్రేమతో వ్యవహరించాలి

కలెక్టర్ కె.హరిత....



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 16: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష, భారత కృత్రిమ అవయవాల తయారీ సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు సహాయ ఉపకరణాల గుర్తింపు నిర్ధారణ శిబిరాన్ని జిల్లా కలెక్టర్ కె.హరిత బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారితో కలిసి ప్రారంభించారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు చేయూత అందించాలని, వారు కూడా అందరితో సమానమేనని పేర్కొన్నారు. కనుచూపు, ఇతర అవయవాలు సరిగా పనిచేయని పిల్లలు, నడవలేని పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రేమతో వ్యవహరించాలని సూచించారు. కనుచూపు లేనివారు, నడవలేనివారు సైతం ఉన్నత రంగాలలో రాణిస్తున్నారని, ఐ.ఎ.ఎస్. అధికారులుగా ఎదుగుతున్నారని తెలియజేశారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల్లోని ప్రతిభను గుర్తించి ఆ దిశగా ప్రోత్సహించాలని స్పష్టం చేశారు. అలింకో సంస్థ సహకారంతో సహాయ ఉపకరణాలు అందించడం అభినందనీయమని, పిల్లలు వాటిని సక్రమంగా వినియోగించుకుని ముందుకు సాగాలని కోరారు.

# తెలంగాణ ఉద్యమ కళాకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

**సాంస్కృతిక సారథిలో 1,000 ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్**

**పోరు తెలంగాణ సెప్టెంబర్ 16 జన్నారం:** తెలంగాణ మలిదశ ఉద్యమంలో తమ కళారూపాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమ కళాకారుల జీవితాలతో ప్రభుత్వం ఆటలాడవద్దని తెలంగాణ ఉద్యమ కళాకారుల రాష్ట్ర నాయకులు లికొండకూరి రాజులి డిమాండ్ చేశారు. సాంస్కృతిక సారథిలో ఉద్యమ కళాకారులకు ఉద్యోగాలు కల్పిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన కోరారు. ఇటీవల శాసనసభలో సాంస్కృతిక శాఖ మంత్రి లిజూపల్లి కృష్ణారావులి కళాకారుల సంక్షేమం గురించి ప్రస్తావించినప్పటికీ, ఉద్యోగాల విషయంలో స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడం పట్ల కళాకారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. తెలంగాణ మలిదశ ఉద్యమ సమయంలో గోసి, గొంగడి ధరించి ఊరు ఊరు తిరుగుతూ పోరుపాటలు, ధూందాం కార్యక్రమాల ద్వారా తెలంగాణ ఉద్యమానికి కళాకారులు తమ వంతు సేవ అందించారని గుర్తు చేశారు. తమ ఆటా పాటలతో తెలంగాణ ఉద్యమంలో ప్రత్యేక ముద్ర వేసిన కళాకారులను ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో లి550 మంది కళాకారులకు ఉద్యోగాలు కల్పించారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం అర్హులైన ఉద్యమ కళాకారులకు ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిందని కొండకూరి రాజు తెలిపారు. అనంతరం లి1,000 ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇవ్వడంతో పాటు, ఈ అంశాన్ని మేనిఫెస్టోలో కూడా ప్రస్తావించారనిలి ఆయన పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ, అనేక మంది ఎమ్మెల్యేలు, మంత్రులు, ఉన్నతాధికారులను కలిసి కళాకారుల సమస్యలను వివరించినా ఇప్పటివరకు స్పష్టమైన పరిష్కారం లభించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. లిసాంస్కృతిక సారథిలో అర్హులైన తెలంగాణ ఉద్యమ కళాకారులకు 1,000 ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేసి, ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలనిలి ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యమ కళాకారులందరినీ ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. లి"హలో కళాకారుడా ఛలో రవీంద్రభారతి"లి కార్యక్రమం చేపట్టి రవీంద్రభారతిని ముట్టడించే స్థాయిలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని తెలిపారు. అదేవిధంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జిగా ఉన్న లిమంత్రి జూపల్లి కృష్ణారావులి సాంస్కృతిక కార్యక్రమాల కోసం ఆదిలాబాద్ జిల్లాలో ఎక్కడ సమావేశం నిర్వహించినా కళాకారులు తమ నిరసనను తెలియజేస్తారని కొండకూరి రాజు హెచ్చరించారు. కళాకారుల సమస్యలపై ప్రభుత్వం ఇకపై కాలయాపన చేయకుండా, ఇచ్చిన హామీలను అమలు చేసి ఉద్యమ కళాకారుల జీవితాల్లో వెలుగులు నింపాలని ఆయన కోరారు.



# ఇంధన భవిష్యత్తుపై విద్యార్థుల శాస్త్రీయ విశ్లేషణ

**జిల్లా స్థాయి సైన్స్ సెమినార్....**

**పోరు తెలంగాణ సెప్టెంబర్ 16: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కాగజ్‌నగర్‌లోని డివిజనల్ సైన్స్ సెంటర్లో బుధవారం జిల్లా స్థాయి సైన్స్ సెమినార్‌ను జిల్లా సైన్స్ అధికారి కటుకం మధూకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, పరిశోధనా ఆలోచనా విధానం పెంపొందించడం, సమకాలీన సమస్యలపై అవగాహన కల్పించడం ఈ సెమినార్ లక్ష్యం. మండల విద్యాశాఖ అధికారి వాసాల ప్రభాకర్ ముఖ్య అతిథిగా, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని దుర్గాప్రసాద్ నిర్వహించారు. ఇండియన్ ఎనర్జీ బాస్కెట్ 2047 -- అవకాశాలు మరియు సవాళ్ల అంశంపై విద్యార్థులు పరిశోధనాత్మక ఆలోచనలు వెల్లడించారు. భవిష్యత్ ఇంధన అవసరాలు, సౌర, పవన, జల, అణు ఇంధనం, బయో ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్, ఎలక్ట్రిక్ వాహనాలు, ఇంధన నిల్వ వ్యవస్థలపై విశ్లేషణాత్మకంగా ప్రసంగించారు. 2047 నాటికి దేశం అభివృద్ధి చెందాలంటే ఇంధన భద్రత, పర్యావరణ పరిరక్షణ, ఇంధన పొదుపు, పునరుత్పాదక ఇంధన వినియోగం, సాంకేతిక అభివృద్ధి అవసరమని వక్తలు పేర్కొన్నారు.ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి కాగజ్‌నగర్ కస్తూరిబా గాంధీ విద్యాలయం 10వ తరగతి విద్యార్థిని గిరిజ దివ్యశ్రీకి, ద్వితీయ బహుమతి కాగజ్‌నగర్ సెయింట్ క్లారెట్ హై స్కూల్ విద్యార్థి కృష్ణ భాంగ్‌కు లభించాయి. తృతీయ బహుమతిని ఆసిఫాబాద్ జెడ్ పి హెచ్ ఎస్ బాలికల పాఠశాల విద్యార్థిని నాబా హూరియా, శ్రీ విశ్వశాంతి హై స్కూల్ విద్యార్థిని సఫా ఫాతిమా పంచుకున్నారు. సైన్స్ సెమినార్లు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి, సమాజ సమస్యలకు శాస్త్రీయ పరిష్కారాలు అన్వేషించేలా ప్రోత్సహిస్తాయని జిల్లా సైన్స్ అధికారి కటుకం మధూకర్ పేర్కొన్నారు.



# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి







**జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య**

**పోరు తెలంగాణ మంచిర్యాల,సెప్టెంబర్ 16, 2026:** ప్రభుత్వ పాఠశాలలలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి నాణ్యత ప్రమాణాలతో త్వరగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. బుధవారం జిల్లాలోని కోటపల్లి మండల కేంద్రంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను సందర్శించి పాఠశాలలో కొనసాగుతున్న సివిల్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని, పనులలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. విద్యార్థులతో మాట్లాడి విద్యాభ్యాసం, పాఠశాలలోని సౌకర్యాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల రికార్డులను పరిశీలించడంతో పాటు ఆపార్ నమోదును, బేస్‌లైన్ పరీక్షల నివేదికలను పరిశీలించి, విద్యార్థుల విద్యా పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. అనంతరం వేమనపల్లి మండలం కల్మల్‌పేటలోని యు.పి.ఎస్.ను సందర్శించి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నోటీసులు అందుకున్న స్థానికులతో మాట్లాడి, నోటీసులకు సంబంధించిన వివరాలు, వారి అభ్యంతరాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ప్రక్రియపై అవసరమైన సమాచారం అందిస్తూ, అందిన అభ్యంతరాలు, సంబంధిత రికార్డులను నిబంధనల ప్రకారం పరిశీలించాలని అధికారులకు సూచించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో నిర్వహించిన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలో స్థానిక సంస్థల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. నిర్మాణంలో ఉన్న గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ సమాఖ్య సంఘం భవనాల పనులను వేగవంతంగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని తెలిపారు. నీటి సంరక్షణ పనులను సమర్థవంతంగా చేపట్టి వర్షపు నీటిని నిల్వ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వికసిత్ భారత్ గ్రామీణ పథకం కింద గ్రామాలలో చేపడుతున్న మౌలిక వసతుల పనులను వేగవంతం చేయాలని తెలిపారు. గ్రామాలలో పారిశుధ్యం, తడి--పొడి చెత్త సేకరణ, ఘన వ్యర్థాల నిర్వహణపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. 16వ ఆర్థిక సంఘం నిధులను గ్రామాల అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యత క్రమంలో వినియోగించాలని, గ్రామ పంచాయతీల సొంత ఆదాయ వనరులను పెంచుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మండలంలోని వీధి దీపాల నిర్వహణను సక్రమంగా చేపట్టాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించే చర్యలు తీసుకోవాలని సూచించారు. రాజారం గ్రామంలో దశావతార విగ్రహాలను సందర్శించి స్థానికులతో మాట్లాడి విగ్రహాలకు సంబంధించిన చారిత్రక నేపథ్యం, ప్రాధాన్యత గురించి తెలుసుకున్నారు. మండలంలోని పశుసంవర్ధక, పశు జనన నియంత్రణ కేంద్రం లను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల విద్యాధికారి, ఎస్ఐ, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో నిబంధనలు పాటించాలి





**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**

**పోరు తెలంగాణ మంచిర్యాల,సెప్టెంబర్ 16, 2026 :** 2026--27 సీజన్‌లో జిల్లాలోని రైతుల నుంచి వరి ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాగ్రత్తలు పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, అధికారులతో కలిసి గ్రామీణ అభివృద్ధి, పౌరసరఫరాల శాఖల అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కొరకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 117 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందించడం జరిగిందని తెలిపారు. నిబంధనలకు లోబడి మాత్రమే వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, ధాన్యం విక్రయించిన రైతులకు ధాన్యం విక్రయించిన 48 గంటల్లోగా చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం గుర్తించిన సన్న రకాల ధాన్యానికి మాత్రమే క్వింటాలుకు 500 రూపాయల బోనస్ చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ఎ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు 2 వేల 461 రూపాయలు, సి గ్రేడ్ ధాన్యానికి 2 వేల 441 రూపాయలుగా ధర నిర్ణయించడం జరిగిందని తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు, ఆలస్యం కలగకుండా వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి, డి.పి.ఎం.లు, పౌర సరఫరాల శాఖ అధికారులు,జిల్లా సమాఖ్య ప్రతినిధులు, ఎ పి ఎం లు, సి సి లు తదితరులు పాల్గొన్నారు.

# రిజిస్ట్రేషన్ చట్టం సెక్షన్ 22ఏపై కలెక్టర్‌కు టీడీపీ మెమోరాండం



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 16: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరితకు తెలుగుదేశం పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ గుళ్ళపల్లి ఆనంద్ ఆధ్వర్యంలో మెమోరాండం అందజేశారు.రిజిస్ట్రేషన్ చట్టం 1908లోని సెక్షన్ 22ఏ ప్రకారం నిషేధిత ఆస్తుల జాబితాలో ఆస్తులను తప్పుగా, పరిమితికి మించి మొత్తంగా చేర్చడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. సెక్షన్ 22ఏ పరిధి, శాసన ఉద్దేశాన్ని పరిగణనలోకి తీసుకుని రికార్డులను సమగ్రంగా సమీక్షించి సవరించాలని, ఫిర్యాదులను సమర్థవంతంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ పెరుగు ఆత్మారాం, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓజోన్ దినోత్సవం



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 16: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రసాయన శాస్త్ర, భౌతిక శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సూర్యుడి నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాల నుంచి ఓజోన్ పొర జీవజాలాన్ని రక్షిస్తుందని, కాలుష్య కారకాల వల్ల ఓజోన్ పొర దెబ్బతినడం వల్ల అనేక దుష్పరిణామాలు సంభవిస్తాయని కళాశాల ప్రిన్సిపల్ కే.శ్రీదేవి వివరించారు. వాతావరణంలోకి నిరంతరం విడుదలయ్యే క్లోరో ఫ్లోరో కార్బన్ల వల్ల ఓజోన్ పొర దెబ్బతిని, అతినీలలోహిత కిరణాలు నేరుగా జీవులపై పడడం ద్వారా చర్మ క్యాన్సర్లు, ఇతర వ్యాధులు సంభవిస్తాయని రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఇ.శారద తెలిపారు. ఓజోన్ పొర రక్షణ కోసం ఏర్పాటైన మాంట్రియల్ ఒప్పందం పట్ల అందరూ అవగాహన కలిగి కాలుష్య కారకాలను తగ్గించాలని సూచించారు.

# మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల సమస్యలపై అసెంబ్లీలో సిర్పూర్ ఎమ్మెల్యే హరీష్ బాబు



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 16: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం టీఎంఆర్ఈఐఎస్ బాయ్స్-1, బాయ్స్-2 పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు అసెంబ్లీలో ప్రస్తావించారు. బాయ్స్-1లో 9 మంది రెగ్యులర్ సిబ్బంది, 19 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఉండగా, బాయ్స్-2లోనూ దాదాపు అంతే సిబ్బంది ఉన్నారని తెలిపారు. పాఠశాలల పక్కనే డంపింగ్ యార్డు ఉండటం వల్ల విద్యార్థులు అనారోగ్యాల బారిన పడుతున్నారని వివరించారు. అడ్మినిస్ట్రేషన్ సరిగా లేదని, మారుమూల జిల్లాకు మంత్రి స్వయంగా వచ్చి రివ్యూ మీటింగ్ నిర్వహించాలని కోరారు. మండలాల్లో ఇంటిగ్రేటెడ్ మండల ఆఫీసు కాంప్లెక్స్‌లను నిర్మించాలని కూడా అసెంబ్లీలో విజ్ఞప్తి చేశారు.

# ఈ రోజు ప్రతి ఇంటి ముందు ఆశీర్వాద దీపాన్ని వెలిగించండి

**బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఎతం శివకృష్ణ.**



**పోరు తెలంగాణ మంచిర్యాల జిల్లా సెప్టెంబర్ 16 :** సెప్టెంబర్ 17వ తేదీ, గురువారం సాయంత్రం ప్రతి ఒక్కరూ ఇంటి ముందు ఆశీర్వాద దీపాన్ని వెలిగించాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఎతం శివకృష్ణ పిలుపునిచ్చాడు. సెప్టెంబర్ 17వ తేదీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదిన పురస్కరించుకొని బిజెపి పార్టీ పిలుపుమేరకు ప్రతి ఒక్కరూ వారి వారి ఇంటి ముందు ఆశీర్వాద దీపాన్ని వెలిగించి మన నరేంద్ర మోడీ గారికి సంఘీభావం తెలుపాలని కోరాడు

# ఈ నెల 17న ఘనంగా ప్రజాపాలన దినోత్సవం



**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**పోరు తెలంగాణ మంచిర్యాల,సెప్టెంబర్ 16, 2026:** జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఈ నెల 17వ తేదీన ఉదయం 10 గంటలకు ప్రజా పాలన దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలకు అధికారులు, అనధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని తెలిపారు.

# బాల్కొండ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ కు వ్యతిరేకంగా డేర్ ఫ్రెండ్స్ యూత్ ప్రతిజ్ఞ



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలించేందుకు యువత ముందుకు రావాలని ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు.బాల్కొండ మండల కేంద్రంలో గురువారం సాయంత్రం 7 గంటల సమయంలో ఆర్మూర్ గల్లి ప్రాంతంలోని డేర్ ఫ్రెండ్స్ యూత్ సభ్యులతో కలిసి డ్రగ్స్ కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఏ సీ పి వెంకటేశ్వర్ రెడ్డి,ఆర్మూర్ రూరల్ సీఐ జాన్ రెడ్డి,బాల్కొండ ఎస్సై శైలేందర్ పాల్గొని యువతకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాల పై అవగాహన కల్పించారు. గంజాయి,ఇతర మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని, మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని సూచించారు.డేర్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో వినాయక మండపం వద్ద డ్రగ్స్, గంజాయి కి వ్యతిరేకంగా ప్రత్యేక ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించేలా ఫ్లెక్సీ ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు.ద

# ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్ డేట్స్ వచ్చేశాయ్.. డిస్కౌంట్లు చూస్తే నోరెళ్లబెట్టాల్సిందే..




ప్రముఖ ఈ కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ తమ ప్రతిష్టాత్మక బిగ్ బిలియన్ డేస్ సేల్ 2026 తేదీలను అధికారికంగా ప్రకటించింది. అక్టోబర్ 9 నుంచి దేశవ్యాప్తంగా ఈ మెగా సేల్ ప్రారంభం కానుండగా, స్పెషల్ మెంబర్లకు ఒక రోజు ముందే అంటే అక్టోబర్ 8 నుంచే ఎర్లీ యాక్సెస్ లభించనుంది. బ్యాంక్ కార్డులపై 10శాతం డిస్కౌంట్లతో పాటు పాటు వేటిపై అదిరిపోయే ఆఫర్లు ఉన్నాయనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.. ఆన్‌లైన్ షాపింగ్ ప్రియులు ఎప్పుడెప్పుడా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్ సేల్ డేట్స్ వచ్చేశాయి. ఈ మెగా సేల్ అక్టోబర్ 9 నుంచి ప్రారంభం కానున్నట్లు ఫ్లిప్‌కార్ట్ అధికారికంగా ప్రకటించింది. ఇందుకు సంబంధించి ఫ్లిప్‌కార్ట్ తమ ప్లాట్‌ఫామ్‌లో ప్రత్యేక మైక్రోసైట్‌ను లైవ్ చేస్తూ, బ్యాంక్ డిస్కౌంట్లు, ప్రత్యేక ఆఫర్ల వివరాలను వెల్లడించింది. సాధారణ యూజర్ల కంటే ఒక రోజు ముందుగానే ప్లస్ మెంబర్స్‌కు ఈ సేల్ అందుబాటులోకి రానుంది. ఫ్లిప్‌కార్ట్ ప్లస్ , ఫ్లిప్‌కార్ట్ బ్లాక్ సభ్యులు, ఫ్లిప్‌కార్ట్ క్రెడిట్ కార్డ్ హోల్డర్లకు ఈ 24 గంటల ఎర్లీ యాక్సెస్ లభిస్తుంది. ప్రధాన సేల్ ప్రారంభం కాకముందే పరిమిత స్టాక్ ఉండే హాట్ డీల్స్‌ను దక్కించుకునే అవకాశం వీరికి దక్కుతుంది.

**బ్యాంక్ ఆఫర్లు -- క్యాష్‌బ్యాక్ ప్రయోజనాలు**

మైక్రోసైట్‌లో పొందుపరిచిన సమాచారం ప్రకారం కస్టమర్లకు భారీ ఆర్థిక రాయితీలు లభించనున్నాయి.

తక్షణ డిస్కౌంట్: యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ కార్డులను ఉపయోగించి చేసే కొనుగోళ్లపై గరిష్టంగా 10శాతం తక్షణ తగ్గింపు లభిస్తుంది.

ఫ్లిప్‌కార్ట్ యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డ్: ఈ కార్డు వినియోగదారులు అదనంగా 10 శాతం వరకు పొదుపు చేయవచ్చు.

సూపర్ మనీ : మొదటి లావాదేవీపై 10శాతం క్యాష్‌బ్యాక్ అందించనున్నారు.

యూపీఐ, ఇతర ప్రముఖ పేమెంట్ గేట్‌వేల ద్వారా చెల్లింపులు జరిపే వారికి సైతం ప్రత్యేక క్యాష్‌బ్యాక్ ప్రయోజనాలు ఉంటాయని సంస్థ తెలిపింది.

**ఏయే విభాగాల్లో భారీ తగ్గింపులు?**

నిర్దిష్ట ఉత్పత్తుల వారీగా ఇంకా ధరలను అధికారికంగా ప్రకటించనప్పటికీ, ఎలక్ట్రానిక్స్, హోమ్ అప్లైయన్స్‌పై భారీ తగ్గింపులు ఉండనున్నట్లు స్పష్టమైంది. స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, పీసీలు, ట్రూ వైర్‌లెస్ స్టీరియో ఆడియో డివైజ్‌లతో పాటు స్మార్ట్‌వాచ్‌లు, స్మార్ట్ హోమ్ అప్లయన్సెస్, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు వంటి గృహోపకరణాలపై భారీ డిస్కౌంట్స్ ఉండనున్నాయి.

**ఐఫోన్, శాంసంగ్ డీల్స్**

కొత్త మొబైల్ కొనాలనుకునే వారికి బిగ్ బిలియన్ డేస్ సేల్ అత్యుత్తమ వేదిక కానుంది.

ఆపిల్ ఐఫోన్లు: ఇటీవల ఆపిల్ కొత్త ఐఫోన్ 18 ప్రో సిరీస్‌ను ఆవిష్కరించిన నేపథ్యంలో మునుపటి మోడళ్లయిన ఐఫోన్ 16, ఐఫోన్ 17 సిరీస్‌లపై అదిరిపోయే ప్రైస్ కట్స్ వచ్చే అవకాశం ఉంది.

శాంసంగ్ గెలాక్సీ: శాంసంగ్ ప్రీమియం ఫ్లాగ్‌షిప్ గెలాక్సీ ఎస్26 సిరీస్‌పై కూడా ఆకర్షణీయమైన ఎక్స్ఛేంజ్ బోనస్‌లు, ధరల తగ్గింపు ఉండవచ్చని టెక్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే అంతర్జాతీయంగా మెమరీ చిప్‌ల కొరత నెలకొన్నందున కొన్ని ఫోన్ల లభ్యత, తుది ధరలపై ప్రభావం పడే అవకాశం ఉంది.

సేల్ ప్రారంభ సమయం దగ్గరపడే కొద్దీ నిర్దిష్ట ప్రోడక్ట్ డీల్స్‌ను ఫ్లిప్‌కార్ట్ ఒక్కొక్కటిగా రివీల్ చేయనుంది. పండుగ సీజన్ షాపింగ్ కోసం వినియోగదారులు ఇప్పటి నుంచే తమ విష్‌లిస్ట్‌లను సిద్ధం చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# మహిళలు ఇంట్లోనే ఉంటూ లక్షలు సంపాదించే బిజినెస్ ఐడియాలు జీరో రిస్క్ సూపర్ ప్రాఫిట్



సొంత కాళ్లపై నిలబడి ఆర్థిక స్వాతంత్ర్యం సాధించాలనే తపన నేడు ప్రతి ఒక్కరిలోనూ కనిపిస్తోంది. భారీగా పెట్టుబడులు పెట్టి, పెద్ద దుకాణాలు ఏర్పాటు చేస్తేనే వ్యాపారం సాధ్యమవుతుందనే భావనను ప్రస్తుత డిజిటల్ యుగం పూర్తిగా మార్చేసింది. ఇంటి బాధ్యతలను నిర్వర్తిస్తూనే స్వయం సమృద్ధి సాధించాలనుకునే మహిళలకు , యువతకు అతి తక్కువ బడ్జెట్‌తో అద్భుతమైన మార్గాలు అందుబాటులోకి వచ్చాయి. అవేంటో ఈ స్టోరీలో తెలుసుకుందాం.. సొంతంగా సంపాదించి ఆర్థిక స్వాతంత్ర్యం సాధించాలనే కోరిక ప్రతి ఒక్కరిలోనూ ఉంటుంది. ముఖ్యంగా ఇంటి బాధ్యతలను నిర్వర్తిస్తూనే స్వయం సమృద్ధి సాధించాలనుకునే మహిళలకు, స్వల్ప పెట్టుబడితో ఏదైనా చేయాలనుకునే వారికి ప్రస్తుతం అనేక అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. వ్యాపారం చేయాలనే ఆసక్తి ఉన్నప్పటికీ.. ఏమి చేయాలి? ఎలా మొదలుపెట్టాలి? అనే డౌట్ చాలామందిని వెనక్కి లాగుతుంది. అయితే ఎక్కువ పైసలు అవసరం లేకుండా, కేవలం రూ.1 లక్షలోపు బడ్జెట్‌తో మీ ఇంటి నుంచే ప్రారంభించగల 4 లాభదాయకమైన వ్యాపార ఆలోచనలు ఇక్కడ ఉన్నాయి.

**హోమ్‌మేడ్ ఫుడ్ క్లౌడ్ కిచెన్**

ప్రస్తుత బిజీ జీవనశైలిలో ఇంట్లో వండిన స్వచ్ఛమైన, పరిశుభ్రమైన ఆహారానికి విపరీతమైన గిరాకీ ఉంది. ఇంటి వంటగదిలోని ప్రాథమిక వస్తువులతోనే చిన్న స్థాయిలో దీన్ని ప్రారంభించవచ్చు.

అవకాశాలు: ఆఫీసు ఉద్యోగులు, విద్యార్థుల కోసం లంచ్ బాక్స్ సర్వీస్, హోమ్ బేకరీ, సాంప్రదాయ పిండివంటలు.

మార్కెటింగ్ వ్యూహం: స్విగ్గీ, జొమాటో వంటి ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్‌లు లేదా వాట్సాప్ గ్రూపుల ద్వారా స్థానిక కస్టమర్లను సులభంగా చేరుకోవచ్చు.

ఫ్రీలాన్స్ సేవలు

పెద్దగా పెట్టుబడి పెట్టాల్సిన పనిలేకుండా, మీకున్న ప్రతిభనే పెట్టుబడిగా మార్చుకునే విభాగమిది. మీ వద్ద ఒక ల్యాప్‌టాప్, కంప్యూటర్, మంచి ఇంటర్నెట్ కనెక్షన్ ఉంటే చాలు, ఇంటి నుంచే గ్లోబల్ క్లయింట్లకు సేవలు అందించవచ్చు.

అవకాశాలు: కంటెంట్ రైటింగ్, డిజిటల్ మార్కెటింగ్, గ్రాఫిక్ డిజైనింగ్, వీడియో ఎడిటింగ్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, ఆన్‌లైన్ అకౌంటింగ్.

పెట్టుబడి: కేవలం ఇంటర్నెట్, అవసరమైన సాఫ్ట్‌వేర్ టూల్స్ లేదా నైపుణ్యాలను మెరుగుపరుచుకునే కోర్సులకు మాత్రమే ఖర్చవుతుంది.

**ఇమిటేషన్ ఫ్యాషన్ జ్యువెలరీ**

బంగారం, వెండి ధరలు ఆకాశాన్ని తాకుతున్న ప్రస్తుత తరుణంలో మహిళలు ట్రెండీగా కనిపించే తక్కువ ధర ఆర్టిఫిషియల్ లేదా ఇమిటేషన్ ఆభరణాల వైపు మొగ్గు చూపుతున్నారు.

# సీసీఆర్‌బీ,సీసీఎస్, టాస్క్‌ఫోర్స్,ఐటీ కోర్,సైబర్ క్రైమ్ విభాగాల అధికారులు, సిబ్బందికి నగదు ప్రోత్సాహకాలు

అంకితభావంతో విధులు నిర్వహిస్తున్న పోలీసు

సిబ్బందిని అభినందించిన సీపీ అంబర్ కిషోర్ ఝా



**పోరు తెలంగాణ,పెద్దపల్లి, సెప్టెంబర్ 16 :** తమకు అప్పగించిన విధులను అంకితభావం, నిబద్ధతతో నిర్వహిస్తూ ప్రతిభ కనబరిచిన సీసీఆర్‌బీ,సీసీఎస్, టాస్క్‌ఫోర్స్,ఐటీ కోర్,సైబర్ క్రైమ్ విభాగాల అధికారులు, సిబ్బందికి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. నేరాల నియంత్రణ, నేరస్తుల గుర్తింపు, సైబర్ నేరాల అరికట్టడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించడం, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడం వంటి అంశాల్లో విశేష కృషి చేసిన అధికారులు, సిబ్బందిని ఈ సందర్భంగా సీపీ అభినందించారు. ఎఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, పోలీసు శాఖలోని వివిధ విభాగాలు సమన్వయంతో పనిచేయడం ద్వారా నేరాలను మరింత సమర్థవంతంగా నియంత్రించడంతో పాటు,నేరాల దర్యాప్తులో వేగం, నాణ్యత పెరుగుతాయని తెలిపారు. సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ అనిల్ ఆధ్వర్యంలో, సీసీఎస్ ఏసీపీలు రవీందర్,ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో,ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో,సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆయా విభాగాలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ తమ విధుల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. సైబర్ నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించడం, బాధితులకు సత్వర సహాయం అందించడం, నేరాలకు సంబంధించిన సమాచారాన్ని విశ్లేషించడం, నేరస్తులను గుర్తించడం వంటి అంశాల్లో అధికారులు, సిబ్బంది చేస్తున్న కృషిని సీపీ ప్రశంసించారు. అదేవిధంగా,నేర నియంత్రణ,అక్రమ కార్యకలాపాలపై నిఘా,నేరస్తుల కదలికలను గుర్తించడం,కేసుల దర్యాప్తునకు అవసరమైన సమాచారాన్ని సేకరించడం వంటి అంశాల్లో టాస్క్‌ఫోర్స్,సీసీఎస్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో చేస్తున్న కృషిని అభినందించారు. ప్రతి పోలీసు అధికారి,సిబ్బంది తమకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధత,క్రమశిక్షణ, సమయస్ఫూర్తితో నిర్వహించాలని సీపీ సూచించారు. విధుల్లో ప్రతిభ కనబరిచే సిబ్బందిని గుర్తించి ప్రోత్సహించడం ద్వారా ఇతర సిబ్బందిలో కూడా మరింత ఉత్సాహం, బాధ్యతాభావం పెరుగుతుందని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే అంకితభావంతో విధులు నిర్వహిస్తూ రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ,నేర నియంత్రణకు మరింత కృషి చేయాలని సీపీ సూచించారు.

# ఐటీసీ బంధన్‌తో మహిళలకు ఆర్థిక భరోసా

స్వయం ఉపాధి అవకాశాలను ఉపయోగించుకొని

ఆర్థికంగా ఎదగాలి : ఏపీఎం మేసాల హేమంతిని

బంజారా బజార్‌లో రిఫ్రెషర్ శిక్షణ.. 25 మంది

మహిళా లబ్ధిదారులకు అవగాహన




**బూర్గంపహాడ్, సెప్టెంబర్ 16 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి కుటుంబ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలనే లక్ష్యంతో ఐటీసీ బంధన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా బుధవారం బంజారా బజార్‌లో రిఫ్రెషర్ శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీఎం మేసాల హేమంతిని హాజరై మహిళా లబ్ధిదారులతో ప్రత్యేకంగా మాట్లాడారు. మహిళలు తమకు అందుతున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని, స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగాలని సూచించారు. చిన్న వ్యాపారాలు, స్వయం ఉపాధి కార్యక్రమాల ద్వారా ఆదాయాన్ని పెంచుకోవడం, కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవడం, అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. మహిళ ఆర్థికంగా బలపడితే కుటుంబం కూడా బలోపేతం మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించినప్పుడు కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగుపడటంతో పాటు సమాజం కూడా అభివృద్ధి చెందుతుందని ఏపీఎం హేమంతిని పేర్కొన్నారు. మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేసి తమకు ఉన్న నైపుణ్యాలను ఉపాధి అవకాశాలుగా మలుచుకోవాలని సూచించారు.

**ఆత్మవిశ్వాసమే తొలి అడుగు**

కార్యక్రమంలో మహిళా లబ్ధిదారులు తమ అనుభవాలు, అభిప్రాయాలను ఏపీఎం హేమంతినితో పంచుకున్నారు. శిక్షణ, అవగాహన కార్యక్రమాల ద్వారా తమలో ఆత్మవిశ్వాసం పెరగడంతో పాటు స్వయం ఉపాధి అవకాశాలపై మరింత స్పష్టత ఏర్పడుతోందని తెలిపారు. మహిళలకు కేవలం అవగాహన కల్పించడమే కాకుండా వారిని ఆర్థిక స్వావలంబన వైపు నడిపించేలా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ భూక్య కుమార్, ఏసీ ఉత్తమ్, మార్జిట్, ఎడిఎస్సి సభ్యుడు పండగ రాములు, సీసీ సుజాతతో పాటు బంజారా పరిధికి చెందిన 25 మంది మహిళా లబ్ధిదారులు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# గిరిజనుల సంక్షేమం, మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక

ప్రాధాన్యత ఇవ్వాలి : జాతీయ

ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్

ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో సిఫారసులకు

తావులేకుండా అర్హులైన

ఎస్టీ కుటుంబాలకు ఇళ్లు అందాలి

ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి

కనెక్షన్ ఉండేలా చర్యలు తీసుకోవాలి

గిరిజన ప్రాంతాల్లో రహదారులు, వంతెనలు, పారిశుద్ధ్య

సౌకర్యాలు కల్పించాలి : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

జిల్లా అధికారులతో సమీక్షించిన

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు, జిల్లా కలెక్టర్





**పోరు తెలంగాణ,పెద్దపల్లి, సెప్టెంబర్ 16 :** జిల్లాలో గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి, హక్కుల పరిరక్షణకు అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు బానోత్ హుస్సేన్ సూచించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి జిల్లా అధికారులతో గిరిజనుల సంక్షేమం, ప్రభుత్వ పథకాల అమలు, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు సిఫారసుల ఆధారంగా జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయని, అటువంటి పరిస్థితులను సరిదిద్దాలని సూచించారు. అర్హత కలిగిన ఎస్టీ కుటుంబాలకు ఎలాంటి సిఫారసులకు తావులేకుండా నిబంధనల ప్రకారం ఇళ్లు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అర్హులైన ప్రతి ఎస్టీ కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు.

**ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి కనెక్షన్**

గిరిజన కుటుంబాలు నివసించే ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి కనెక్షన్ ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జాటోత్ హుస్సేన్ సూచించారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామ కార్యదర్శులు తమ పరిధిలోని ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి కనెక్షన్ ఉందో లేదో పరిశీలించాలని, నీటి వృథా జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతులకు ప్రాధాన్యత**

పట్టణాలు, గ్రామాల్లో ఎస్టీ ప్రజలు నివసించే ప్రాంతాల్లో రహదారులు, డ్రైనేజీ, ఇతర మౌలిక వసతులు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు సూచించారు. గిరిజన ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణను సక్రమంగా చేపట్టాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో అవసరమైన రహదారులు, వంతెనలకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాలని అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ,పెద్దపల్లి జిల్లాలో మొత్తం సుమారు 7.9 లక్షల జనాభా ఉండగా, అందులో సుమారు 12 వేల మంది ఎస్టీ జనాభా ఉన్నారని తెలిపారు. జిల్లాలో ఎస్టీ జనాభాలో ప్రధానంగా ఎరుకల, లంబాడా సామాజిక వర్గాల వారు ఉన్నారని వివరించారు. ఎస్టీ జనాభాలో అధిక శాతం కుటుంబాలు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నందున వారి ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

**ఎస్టీలకు 204 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు**

పెద్దపల్లి జిల్లాలో ఎస్టీ వర్గాలకు 204 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 46 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. మిగిలిన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి, అర్హులైన లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో ప్రయోజనం అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

**2310 ఇళ్లకు సౌర విద్యుత్ ప్యానెళ్ల ఏర్పాటు**

ధర్మారం మండలం నంది మేడారం గ్రామాన్ని పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన కింద మోడల్ గ్రామంగా ఎంపిక చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. గ్రామంలోని 2,310 ఇళ్లకు సౌర విద్యుత్ ప్యానెళ్లను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.గిరిజన ప్రాంతాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, విద్య, వైద్యం, ఉపాధి, భూ సమస్యలు, ఇతర మౌలిక వసతుల కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ఎస్టీ కుటుంబాలకు సంబంధించిన సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, సంబంధిత శాఖల సమన్వయంతో నిబంధనల మేరకు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి గిరిజన కుటుంబానికి చేరేలా నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎస్టీ కమిషన్ డైరెక్టర్ పి. కళ్యాణ్ రెడ్డి, అదనపు కలెక్టర్లు జె. అరుణ శ్రీ బి. శ్రీరాములు, డిసిపి రాంరెడ్డి, గిరిజన అభివృద్ధి అధికారి సంగీత, జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్ అరబ్ దేశాల్లోనే ఎందుకుంటుంది ఇండియాలో ఎందుకుండదు..? కోట్ల ఏళ్ల రహస్యం ఇదే

ప్రపంచ ఆర్థిక వ్యవస్థను శాసించే ఏకైక సహజ వనరు ముడి చమురు. పెట్రోల్, డీజిల్ ధరలు స్వల్పంగా మారినా ప్రపంచ దేశాల బడ్జెట్లు తలకిందులవుతాయి. అయితే సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్, ఇరాక్ వంటి అరబ్ దేశాల ఎడారుల్లో అపారమైన చమురు నిల్వలు ఉండగా.. విస్తారమైన భూభాగం కలిగిన భారతదేశంలో ఎందుకు అంతంతమాత్రంగానే ఉన్నాయి? దీన్ని వెనుకున్న సైన్స్ గురించి ఈ స్టోరీలో తెలుసుకుందాం.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను శాసించే శక్తి క్రూడ్ ఆయిల్. పెట్రోల్, డీజిల్ ధరలు స్వల్పంగా పెరిగినా యావత్ ప్రపంచం గగ్గోలు పెడుతుంది. ఈ క్రమంలో ప్రతి ఒక్కరి మదిలోనూ మెదిలే సాధారణ ప్రశ్న.. సౌదీ అరేబియా, ఇరాక్, కువైట్, యూఏఈ వంటి అరబ్ దేశాల ఎడారుల్లోనే ఇంత అపారమైన చమురు నిల్వలు ఎందుకున్నాయి? సువిశాలమైన భారతదేశంలో ఎందుకు లేవు?" అని.. ఇది కేవలం భౌగోళిక అదృష్టం కాదు. దీని వెనుక కోట్ల సంవత్సరాల నాటి భూగర్భ పరిణామాలు, సముద్రాల కదలికలు, ఒక సంక్లిష్టమైన సైన్స్ దాగి ఉంది.

**క్రూడ్ ఆయిల్ ఎలా తయారవుతుంది?**

చమురు అనేది డైనోసార్ల శిలాజాల వల్ల ఏర్పడిందనేది ఒక అపోహ. కోట్ల సంవత్సరాల క్రితం ప్రాచీన సముద్రాలలో నివసించిన మైక్రోస్కోపిక్ జీవులు , ఆల్గే వంటి సూక్ష్మజీవులు చనిపోయి సముద్ర గర్భంలో పేరుకుపోయాయి. వాటిపై మట్టి, ఇసుక, అవక్షేపాలు పొరలు పొరలుగా చేరాయి. ఆక్సిజన్ లేని వాతావరణంలో, తీవ్రమైన వేడి, భూగర్భ పీడనం కారణంగా ఈ సేంద్రీయ పదార్థం క్రమంగా హైడ్రోకార్బన్లుగా మారి ముడి చమురు, సహజవాయువుగా రూపాంతరం చెందింది.

**అరబ్ దేశాలు ఎందుకు చమురు నిలయాలు అయ్యాయి?**

ప్రస్తుతం మనం చూస్తున్న మధ్యప్రాచ్యం ఎల్లప్పుడూ పొడి ఎడారిగా లేదు. కొన్ని కోట్ల సంవత్సరాల క్రితం అది వేరే భౌగోళిక పరిస్థితులలో ఉంది.

ప్రాచీన టెథిస్ మహాసముద్రం: దాదాపు 100 నుండి 250 మిలియన్ సంవత్సరాల క్రితం, ఆఫ్రికా, యురేషియా ఖండాల మధ్య టెథిస్ సముద్రం ఉండేది. ఇది నిస్సారమైన, వెచ్చని ఉష్ణమండల సముద్రం. ఇక్కడ ప్లాంక్టన్, సూక్ష్మజీవుల జనాభా ఊహించని స్థాయిలో పెరిగింది. టెక్టోనిక్ ప్లేట్ల అనుకూలత: టెక్టోనిక్ ప్లేట్ల కదలికల వల్ల ఈ సముద్రం మూసుకుపోయి, అందులోని ట్రిలియన్ల టన్నుల సేంద్రీయ పదార్థం భూగర్భంలో సమాధి అయింది. పర్ఫెక్ట్ జియోలాజికల్ ట్రాప్ : కేవలం చమురు తయారైతే సరిపోదు. అది పైకి ఆవిరైపోకుండా లేదా చెల్లాచెదురు కాకుండా ఉండాలి. అరబ్ ప్రాంతంలో విస్తారమైన సున్నపురాయి, ఇసుకరాయి పొరలు చమురును నిల్వ చేయడానికి స్పాంజిలా పనిచేశాయి. వాటి పైభాగంలో ఉప్పు పొరలు, గట్టి రాతి పొరలు సీల్ లాగా ఏర్పడి చమురును పైకి పోకుండా బంధించాయి. అందుకే అక్కడ సులభంగా తవ్వితీసేంత పెద్దపెద్ద చమురు నిల్వలు ఏర్పడ్డాయి.






**మరి భారతదేశంలో చమురు ఎందుకు తక్కువగా ఉంది?**

ఇండియాలో చమురు అసలే లేదనడం అవాస్తవం. అస్సాం, రాజస్థాన్, గుజరాత్, ముంబై హై, కృష్ణా-గోదావరి బేసిన్ వంటి ప్రాంతాల్లో భారత్ వద్ద చమురు, గ్యాస్ నిల్వలు ఉన్నాయి.

# బాబోయ్ బుల్లితెర



సమాజం మారుతున్న కొద్దీ విలువలు మారడం కాదు, మారుతున్న సమాజానికి అనుగుణంగా విలువలు శాశ్వతంగా ఉండేలా చూడాలి టీవీ ఛానళ్లు. ముఖ్యంగా మానవ ఔన్నత్యం కోసం ఆయా రంగాల్లోని నిష్ణాతులైన వారితో చర్చలు జరిపిస్తూ పరిపూర్ణ మానవ సమాజం కోసం పురాణ వాఙ్మయం నుంచి కానీ, ఆధునిక సాహిత్యం నుంచి కానీ సందేశాలను తీసుకొని వాటిని ప్రదర్శించాలి. అలా అని మన జీవితాలను శాసించే ఆచారాలు, సంప్రదాయాలు, కట్టుబాట్లు కాలంతో ఎలాగూ మారుతాయి! అదే సమయంలో ఈ సమాజం మనగడకు, వికాసానికి మీడియా మాధ్యమాలు శాశ్వత విలువలను ఎప్పుడూ ఏదో ఒక రూపంలో అందిస్తూనే ఉండాలి. ధారావాహికల్లో (సీరియళ్లు).. హింస, పరపీడనం, డాబు- దర్పాల ప్రదర్శన, ఒకరి మీద మరొకరు కుట్రలు, కుయుక్తులు చేసుకోవడం, పన్నాగాలు పన్నడం, హత్యా ప్రయత్నాలు, చిన్న పిల్లల వయసుకు మించి డైలాగులు చెప్పించడం తప్ప ఇంకేమీ కనిపించడం లేదు. దీనివల్ల 'ఇలాగే ఉండాలేమో?' అని ప్రేక్షకులు అనుకరించే ప్రయత్నం చేస్తారు. ముందుముందు కూడా ఇదే పోకడలకు పోతే సమాజం విచ్ఛిన్నమవుతుంది. ఇంతకాలం పురాణాలతోనో, నాటకాల ద్వారానో, పాటల ద్వారానో, శతకాల ద్వారానో నీతినియమాలు, ధర్మ లక్షణాలు చెప్పించి, వాటిని శ్రోతలు, పాఠకుల మనసుల్లోకి ఎక్కించేవారు. అలా స్థిరంగా ఆచరించడం వల్లనే వ్యవస్థ పరంగాను, సంస్కృతి పరంగాను, వారసత్వ పరంగానూ వేల సంవత్సరాల నుంచి భారతదేశం కుటుంబ విలువలను నిలుపుకొంటూ వస్తున్నది. రానురాను నాటకాల ప్రదర్శనలు తగ్గిపోయాయి. ప్రేక్షకుల ఆదరణ లేకపోవడం, ప్రదర్శనల ద్వారా వారికి తగినంత ఆదాయం రాకపోవడం అందుకు ప్రధాన కారణాలు. శాస్త్రసాంకేతిక రంగాలు దూసుకురావడం, వేగం పెరగడం, ప్రజలు కూడా ఉరుకుల పరుగుల జీవితానికి అలవాటు పడటం మొదలైన కర్ణుడి చావుకు అనేక కారణాల వలెనేసంహితం=సాహిత్యం కాస్తా 'కు' హితం అవుతున్నది. ఈ నేపథ్యంలోనే సీరియళ్లు దూసుకువచ్చాయి. అయితే, వాటి పోకడ మరీ దారుణంగా తయారైంది. సీరియళ్లలో ఆడవాళ్ల దుర్మార్గాలు, దాష్టీకాల వల్ల సమాజంలో తప్పుడు సంకేతాలు వెళ్తున్నాయి. ప్రస్తు త కుటుంబాలపై వాటి ప్రభావం ఎంతో ఉన్నది.

'ఇవన్నీ తెలిసి మీరెందుకు సీరియల్ చూస్తున్నారు?' అని ఎవరైనా నన్ను ప్రశ్నించవచ్చు. అందులోని మంచి చెడులను చెప్పడానికి నేనూ సీరియళ్లు చూస్తాను. ఆదిశంకరుల వంటివారు కూడా ఉభయభారతితో వాదనలో శృంగారపరమైన చర్చ వచ్చినప్పుడు కాస్త గడువు కోరి రాజు శరీరంలో పరకాయ ప్రవేశం చేశారు. ఏదైనా విషయం గురించి మంచి, చెడు చెప్పాలంటే మనకు తొలుత తెలిసి ఉండాలి కదా! మహిళలకు క్రూర మనస్తత్వం ఉన్నట్టు సీరియళ్లలో చూపించడం వల్ల మహిళలకే నష్టం. ఒక సీరియల్‌లో చిన్న కోడలు గయ్యాళి వలె, మరొక సీరియల్‌లో పెద్ద కోడలు బ్రహ్మరాక్షసి వలె, మరోచోట చదువుకున్న కోడలు దుష్టురాలి వలె, ఇంకో సీరియల్‌లో చదువుకున్న అత్తగారు క్రూరురాలి వలె, ఇలా అన్ని సీరియళ్లలో మహిళా ప్రతినాయికల (విలన్) పాత్రలను సృష్టిస్తున్నారు. ఇక వారి చర్యలెలా ఉంటాయం టే.. ఇదివరకే వివాహమైన వ్యక్తికి మరో వివాహం చేయాలని ప్రయత్నించడం, సదరు వ్యక్తి ధర్మచారిణిని తరిమేయాలని పన్నాగాలు పన్నడం.. లాంటి సీన్లు ఎక్కువగా ఉంటాయి. ఏకపత్నీవ్రతుడిగా కీర్తిపొందిన రాముడు కుటుంబాలకు ఇచ్చిన విలువల భరిణ రామాయణం. దాన్ని తునా తునకలు చేయడమే సీరియళ్ల పన్నాగమా? లేక పంతమా? పురుషుల పాత్రలు మాత్రం సందేశాత్మకంగానే ఉంటాయి. పురుషుల పాత్రలను నోట్లో నాలుక లేని వారుగానో, లేక మరీ మంచితనాన్ని ప్రదర్శించేవారుగానో చిత్రీకరిస్తారు. కానీ, సీరియళ్లలో ఆడవారి మాటలెలా ఉంటాయంటే.. 'అది ఎట్లా చేస్తున్నదో చూడు', 'దాన్ని జుట్టు పట్టు లాగి కొట్టాలి' అనే డైలాగ్‌లు కనిపిస్తుంటాయి. విష ప్రయోగాలు చేయడం, లేదా కాలో, చెయ్యో విరగ్గొట్టి మంచంలో పడేసి, కాపురం చేయకుండా చూడాలని, నూనె డబ్బాలను మెట్ల మీద కుమ్మరించడం, లేదా ఫెన్సింగ్‌కు కరెంటు షాక్ వచ్చేలా అమర్చడం%ఔ% లాంటి సీన్లు ఎక్కువగా ఉంటాయి. ఇవే కాకుండా చేతబడులు, క్షుద్రపూజలు చేయించడం, మంత్రాలు-తంత్రాలు, మాయలు, మన్ను-మశానం అన్ని ప్రయత్నిస్తుంటారు. ఇలా మూఢనమ్మకాలను పెంచి వందల ఏండ్లు వెనుకకు ప్రేక్షకులను తీసుకుపోవడం మంచిదేనా? అసలవన్నీ చూపించవచ్చా? నాటక లక్షణాలు వారికి తెలియవా? దేన్ని చూపించాలనేది చానళ్లు పాటిస్తున్నాయా? నియమ నిబంధనల గురించి చానళ్లకు తెలియదా? దర్శక-నిర్మాతలకు తెలియదా?

హిందూ వ్యవస్థకు ఉన్న పవిత్రతను పోగొట్టి కుటుంబాన్ని విచ్ఛిన్నం చేసే సీరియళ్లను చూసినవారు ఏం కావాలి? ఎందుకంటే ఫ్యామిలీ టైమ్ అని కలిసి ఫ్యామిలీ రూంలో కూర్చొని టీవీ ఆన్ చేస్తే వచ్చే సీరియళ్లు ఇవే కదా? మరి అవి భార్యల సంతృప్తి కోసం కూర్చొని చూస్తారు. ఎలాంటి సంతృప్తి అంటే? పిల్లలు ఉద్యోగరీత్యా దూరప్రాంతాల్లో ఉంటే దంపతులు రోజూ బయటకు పోలేరు. కనుక టీవీల్లోనే సమయం గడుపుతారు. అలా ఉపయోగపడుతున్నాయి సీరియళ్లు. అలాంటప్పుడు సీరియల్ అవసరమే కదా? అని అంటారేమో? సీరియళ్లు ఆపేయాలని కాదు నేను చెప్పేది. అందులో నేరాలు- ఘోరాలు తగ్గించుకుంటే కాస్త మంచిదేమో? అని నా అభిప్రాయం. ఒకతను ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకుంటాడు. ఆ విషయం తల్లికి నచ్చదు. తన కొడుక్కి ఎలాగైనా రెండో పెళ్లి చేయాలని, ఆ ఇంట్లో కారణం లేకుండానే ఉండే తమ్ముడి కూతురిని తన కొడుకుకు కట్టబెట్టాలని, అందుకు కోడలిపై ఏదో ఒక నేరం మోపి ఇంట్లోంచి వెళ్లగొట్టాలని, తెగ ప్లాన్లు వేస్తూ ఉంటుంది ఓ అత్త. నిజ జీవితంలో ఎంత కోపమున్నా కూడా ఇలా తన కుటుంబసభ్యులను చావగొట్టాలని చూస్తారా? లేదా అంగవైకల్యం వచ్చేలా చేయాలనుకుంటారా? ఇలాంటి వాటిని లీనమై చూస్తున్నారు కొంతమంది ప్రేక్షకులు. ఇంకా రేపు ఏం జరుగుతుంది? ఆ పిల్ల చస్తుందా? లేక దాని కాలు విరుగుతుందా? అని ఆడవాళ్లను తిట్టుకుంటూ కొంతమంది మగవారూ చూస్తారు. ఉత్కంఠ రేపి వదిలేస్తారు. సీరియళ్లు వినోదాత్మకంగా ఉండి మనసుకు హాయి కలిగించి సేదతీర్చేలా ఉండాలి. సమాజాన్ని కదిలించేలా చైతన్యవంతమైన కథలతో సందేశాత్మకంగా ఉండాలి. ముఖ్యంగా, ఆడ విలన్లను తగ్గిస్తే మంచిదని నా అభిప్రాయం. ఒకవేళ దుష్ట స్త్రీల గురించి చెప్పాలనుకొంటే మన ఇతిహాసాల్లో, పురాణాల్లో దుష్ట పాత్రలు లేవా? వాటి వలె చిత్రీకరించి, ఏది చెప్పినా బుజ్జగించినట్టు చెప్పాలి. ఎందుకంటే ఈ సమాజంలో ఇది వరకే చాలామంది భార్యా బాధితులున్నారు. వారు మరో రకంగా హింసింపబడుతున్నారు. పెళ్లికాని 40 సంవత్సరాల బ్రహ్మచారులు, పెళ్లికాని ప్రసాదులున్నారంటే సర్దుకుపోయే మనస్తత్వం ఉన్న ఆడపిల్లలు కరువయ్యారనే కదా అర్థం! చాలామంది మహిళలు సీరియళ్లకు వ్యసనపరులైపోతున్నారు. వారు ఒక్క రోజు కూడా చూడకుండా ఉండరు. పూర్వకాలంలో విలువలు పట్టు తప్పిపోతున్న ప్రతీసారి ఎవరో ఒక మహాత్ముడు ఆధ్యాత్మిక గురువై తమ బోధనలతో మళ్లీ ఆ విలువలను నిలబెట్టే ప్రయత్నం చేసేవారు. అలా పూర్వం అనసూయ, అరుంధతి లాంటి మునిపత్నులు ఆడవారికి మంచి-చెడుల తారతమ్యం చెప్పి జ్ఞానులను చేసేవారు. వాటిని సీత, ద్రౌపది వంటివారు విని ఆచరించి చూపా రు. అలా ఈ మహిళామణుల స్థానంలో టీవీ చానళ్లు ఆకట్టుకునే సీరియళ్లతో మైత్రీ పూర్వక కథనాలను ప్రదర్శించి, ఆ విలువలను నిలబెట్టాలి. అలా సామాజిక జీవితంలో శాశ్వత విలువలకున్న ప్రాధాన్యాన్ని చెప్పాలనుకుంటే ఎవరినీ కించపరచకుండానే చెప్పవచ్చు. ఉదాహరణకు మందర లాంటి ఆయా పాత్రలకు సముచిత స్థానాన్ని ప్రాముఖ్యాన్ని లోగడ కూడా ఇచ్చేవాళ్లు. ఇప్పుడు కూడా అలా ఇస్తూ సీరియల్ తీయవచ్చు. అప్పుడే నిర్మాతలను అభ్యుదయ నిశ్రేయస్సులని అనవచ్చు.

జీవితంలో రోజు ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం కనుక్కొనేందుకు మంచి మాటలు లేదా మంచి నడవడికతోనే ఎలా చెప్పాలని ఆలోచించాలి. ఎందుకంటే మానవుల పరస్పర బంధాలతో కలిసి చేసే పనులు, నేర్పరితనంతో చేసే పనులకు వీటి వల్ల గండిపడి శాంతిని కోల్పోతారు. మానవ ఐక్యత లోపించి, ఎన్నో కష్టాలకు దారితీస్తుంటాయి. ఇలాంటి వ్యాకులత కలిగించే సీరియళ్ల స్థానంలో పనులు చేసి అలసిపోయిన వారికి ప్రశాంతతను కలిగించే కథనాలను ప్రసారం చేయాలి. ఏ కావ్యం రాసినా, ఏ నవల రాసినా, సాహిత్య ప్రక్రియలో ఏది రాసినా మానవ కల్యాణమే లక్ష్యంగా సాగాలి. అంతే తప్ప ద్వేషాలు- పగ-ప్రతీకారాలతో సీరియళ్లు తీస్తే, రోజూ వాటిని పదే పదే చూపెడితే ఆ ప్రభావం కొద్ది కొద్దిగా మనిషిని మృదు స్వభావం కోల్పోయేలా చేస్తుంది. మొరటుగా మారుస్తుంది. నిజ జీవితంలోనూ సాటివారిని హింసించవచ్చని అనిపించవచ్చు. అప్పుడు ఆ సీరియల్ దుష్ప్రభావం చూపిందనే అనుకోవాల్సి ఉంటుంది. అందరూ అలాంటి అత్తాకోడళ్లే ఉన్నారనుకోవద్దు. అయినా సరదాగా చూసేవారూ ఉన్నారు. కాకపోతే దానికన్నా ప్రమా దం ఏమంటే సీరియళ్లు చూడటం అంటువ్యాధిగా మారడం. ఆ వేళకు బంధువు వచ్చినా పగవాడిగా అనిపిస్తాడు. లేదా తన పిల్లలో, భర్తనో క్రికెట్ చూడాలని రిమోట్ ఇవ్వమంటే వారి మీద వీరికి వచ్చే కోపం అంతా ఇంతా కాదు. ఇలాంటి వారి సంఖ్య ఎక్కువవుతున్నది. టీవీ చానళ్లు ఏదో కాలక్షేపం కోసం హింసా ప్రవృత్తి ఉన్న సీరియళ్లను తీస్తున్నాయిలే అని ఎవరికివారే ఉదాసీనంగా ఊరుకుంటే ఎలా? అటువంటి ఫార్ములాతో ఓ సీరియల్ విజయవంతమైందని అనుకోండి! మరో నిర్మాత అలాగే కుట్రలు నిండిన సీరియల్ తీసి దానికి రేటింగ్ పెరిగితే, మళ్లీ నేర ప్రవృత్తి ఉన్న మహిళలను కథా నాయికలుగా చేసి మరో సీరియల్ తీస్తారు. అలా కాకుండా మంచి కథనాలతో ప్రబోధాత్మకంగా, వినోదాత్మకంగా, టీవీ ముందు కొంత సమయం గడిపినా ఏదో ఒకటి నేర్చుకోవడమో, తెలుసుకునేలా సీరియళ్లు ఉండాలి. అప్పుడే మానసిక ఆందోళనలు కలగకుండా ప్రశాంతంగా ఉండవచ్చు

# కోల్‌కతాలో ఎకో-ఫ్రెండ్లీ వెకేషన్ గైడ్?లైన్స్.. వీటితో టూర్ సాఫీగా..











పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతా చరిత్ర, కళ, సంస్కృతి అద్భుతమైన కలయిక. ఈ నగరం దాని మార్కెట్లు, వలసరాజ్యాల వాస్తుశిల్పం, విలాసవంతమైన పండుగలు, స్థిరమైన పర్యాటక రంగానికి ప్రసిద్ధి చెందింది. ఈ నగరంలో ఎకో-ఫ్రెండ్లీ వెకేషన్ చేయవచ్చు. యాత్రను ప్లాన్ చేయడంలో సహాయపడటానికి కొన్ని గైడ్ లైన్స్ మీ కోసం.. పర్యావరణ అనుకూల హోటళ్లను ఎంచుకోండి: ఎకో-ఫ్రెండ్లీ వెకేషన్ గడపడానికి సులభమైన అడుగు ఏమిటంటే, మీకు స్థిరమైన బస ఉండేలా చూసుకోవడం. శక్తి వినియోగాన్ని తగ్గించడం, వ్యర్థాలను తగ్గించడం, నీటిని సంరక్షించడం లక్ష్యంగా పెట్టుకున్న పర్యావరణ అనుకూల గెస్ట్‌హౌస్‌లు, హోటళ్ళు కోల్‌కతాలో పుష్కలంగా ఉన్నాయి. గ్రీన్ ఎనర్జీ, రీసైక్లింగ్ ప్రోగ్రామ్‌లతో ఉన్న వసతి కోసం చూడండి. కొన్ని హోటళ్ళు సేంద్రీయ భోజనాన్ని కూడా అందిస్తాయి. వాటి అలంకరణ, కార్యకలాపాల కోసం స్థానిక సంస్కృతిని ఉపయోగిస్తాయి. అటువంటి ప్రదేశాలలో బస చేయడం కార్బన్ పాదముద్రను తగ్గించడమే కాకుండా, స్థిరత్వంపై దృష్టి సారించే వ్యాపారాలకు కూడా సహాయపడుతుంది.

పర్యావరణ అనుకూల ప్రజా రవాణా ఎంపికలను పరిగణించండి: కోల్‌కతా పసుపు టాక్సీలు, ట్రామ్‌లు, బస్సులు, కోల్‌కతా మెట్రో వంటి ప్రజా రవాణా వ్యవస్థలతో చాలా అభివృద్ధి చెందింది. మీరు నగరం గుండా ప్రయాణిస్తుంటే ట్రామ్ వ్యవస్థ ఒక గొప్ప మార్గం. ఇది ఆసియాలోని పురాతన ట్రామ్ వ్యవస్థలలో ఒకటి. పర్యాటకులుగా చూడటం కూడా సరదాగా ఉంటుంది. తక్కువ దూరాలకు కారు తీసుకోవడానికి బదులుగా నడవడానికి ట్రై చేయండి చేయండి. కోల్‌కతాలోని అనేక ప్రదేశాలు మైదాన్, విక్టోరియా మెమోరియల్ చుట్టూ ఉన్న అనేక మైదానాలు వంటి నడవడానికి అనుమతిస్తాయి.

పర్యావరణ అనుకూల స్థానిక విక్రేతల నుండి కొనుగోలు చేయండి: కోల్‌కతా చిన్న వ్యాపారాలతో నిండిన నగరం. ఇది చేతివృత్తులవారికి కేంద్రంగా ఉంది. భోజనాల కోసం బయటకు వెళ్ళేటప్పుడు, ముందుగా స్థానిక విక్రేతలు, ఉత్పత్తులను తనిఖీ చేయండి. పర్యావరణ అనుకూల వ్యాపారాలకు మద్దతు ఇవ్వడానికి, సేంద్రీయ, స్థానికంగా లభించే కాలానుగుణ ఆహారాన్ని అందించే ప్రదేశాలలో తినడానికి ప్రయత్నించండి. కోల్‌కతాలోని అనేక రెస్టారెంట్లు వ్యర్థాలను తగ్గించడం, శాఖాహార ఆహారాన్ని అందించడం ద్వారా పర్యావరణ అనుకూల పద్ధతులను అనుసరిస్తున్నాయి. మీరు సావనీర్‌ల కోసం చూస్తున్నట్లయితే, దక్షిణాపన్, న్యూ మార్కెట్‌ను సందర్శించి, జనపనార, బంకమట్టి ఉపయోగించి చేతితో తయారు చేసిన వస్తువులు తీసుకోండి.

పార్కులు, ఉద్యానవనాలను సందర్శించండి: ఇతర మెట్రోపాలిటన్ నగరాల మాదిరిగానే, కోల్‌కతాలో అందమైన ఉద్యానవనాలు పార్కులు ఉన్నాయి. ఇక్కడ తాజా గాలిని ఆస్వాదించవచ్చు. కోల్‌కతాలో మీ దృష్టిని ఆకర్షించే రెండు పార్కులు న్యూ టౌన్‌లోని ఎకో పార్క్, మైదాన్. హౌరాలోని ఇండియన్ బొటానిక్ గార్డెన్ దక్షిణ ఆసియాలోనే అతిపెద్ద, పురాతన బొటానికల్ గార్డెన్‌లలో ఒకటి. గ్రేట్ బన్యన్ ట్రీ వంటి లెక్కలేనన్ని వృక్ష జాతులను కలిగి ఉన్నందున ప్రకృతి ప్రేమికులను ఆకర్షిస్తాయి.

పర్యావరణ పర్యటనలు, స్థానిక అనుభవాలు: మీ ప్రయాణాన్ని విలువైనదిగా చేసుకోవడానికి, పర్యావరణ పర్యటనలు లేదా సంరక్షణ లక్ష్యంగా ఉన్న సాంస్కృతిక అనుభవాల గురించి ఆలోచించండి. మీరు కోల్‌కతా నుంచి కొన్ని గంటల దూరంలో ఉన్న సుందర్‌బన్స్‌ను సందర్శించవచ్చు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద మడ అడవులు, యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశం. ఈ పర్యటనలు ఎక్కువగా ఈ ప్రాంతం ప్రత్యేకమైన జీవవైవిధ్యం, సంరక్షణ గురించి అవగాహన కల్పించడంపై కేంద్రీకృతమై ఉన్నాయి. దుర్గా పూజ వంటి సాంస్కృతిక కార్యక్రమాలను కూడా మీరు జరుపుకోవచ్చు,

# పోడు జీవుల గోడు



అటవీభూముల విషయంలో కాంగ్రెస్ సర్కారు రెండు నాల్కల ధోరణి విస్మయం కలిగిస్తున్నది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని అటవీ ప్రాంతాన్ని చెరబట్టబోయి భంగపడిన సంగతి తెలిసిందే. అదే సర్కారు గిరిజన ప్రాంతాల్లోని భూములను అటవీ భూములంటూ నానా హంగామా చేస్తున్నది. అడవిబిడ్డలను కడగండ్లపాలు చేస్తున్నది. ఈ ప్రభుత్వ హయాంలో జరిగిన్న ఘోర దురాగతాలు ఇన్నీఅన్నీ కావు. విద్యార్థులు, బుద్ధిజీవులు కలిసిపోరాడితే గానీ కేంద్ర వర్సిటీ భూములను కాపాడుకోవడం సాధ్యపడలేదు. కానీ, అమాయక గిరిజనుల విషయం అలా కాదు. కొండల్లో, కోనల్లో జీవనం సాగించే అడవి బిడ్డలు పోడు భూములను కాపాడుకునేందుకు నానా అగచాట్లు అనుభవించాల్సి వస్తున్నది. పోలీసుల బూట్ల కింద తండాలు, గూడేలు నలిగిపోతున్నాయి. ప్రతిఘటిస్తే దయాదాక్షిణ్యాలు చూపకుండా, ఆడామగా అనే తేడా లేకుండా నరకం చూపిస్తున్నారు. నిన్నామొన్నటి లగచర్ల నుంచి రంగంపేట, కోసగుంపు వరకు ఇదే తతంగం. 'ప్రాణాలైనా వదులుకుంటం కానీ భూములను వదులుకోబోమ'ని గిరిజనులు అంటే సర్కారు పోలీసు లాఠీని ప్రయోగించి దమనకాండకు దిగుతున్నది. వారు మన పౌరులు, మనం కాపాడాల్సిన పౌరులు అనే స్పృహ లేకుండా తరిమితరిమి కొడుతున్నది. మహిళలపై హింస ప్రయోగించడం సర్కారు కర్కశత్వానికి పరాకాష్ఠ. ఇది ఏ తరహా ప్రజాపాలన?

మొన్నటికిమొన్న రాజన్న సిరిసిల్లా జిల్లాలోని రంగంపల్లిలో పోడు భూములపైకి సర్కారు దండెత్తింది. ఎవుసమే జీవనాధారంగా బతికే రైతన్నల నోటికాడి ముద్ద ఎత్తగొట్టేందుకు సమకట్టింది. ఇంకా పట్టాలివ్వని పోడు భూములను అటవీ భూములంటూ వితండవాదం ముందుకుతెచ్చింది. ప్లాంటేషన్ పేరుతో లాగేసుకునేందుకు సర్కారు ఎత్తులు వేసింది. ఊరు ఊరంతా ఒక్కటై ఎదురుతిరగడంతో తోకముడిచింది. ఇక భద్రాద్రి జిల్లా కోసగుంపులో జరిగిన దారుణాలు లగచర్ల దురాగతాలను మరిపించేలా ఉన్నాయి. శత్రు దేశంపైకి శతఘ్నులు తోలినట్టుగా అక్కడి భూములపైకి సర్కారు జేసీబీలతో దండెత్తింది. ఇదేమిటని ప్రశ్నించిన గిరిజన మహిళలతో ఖాకీలు వ్యవహరించిన తీరు సభ్య సమాజం తలదించుకునేలా ఉంది. ఎప్పటినుంచో సాగు చేసుకుంటున్న భూముల్లోకి ఎందుకు వచ్చారని ప్రశ్నిస్తే నాటిన విత్తనాలు తవ్విపోస్తామంటూ రెచ్చిపోయారు. నిస్సహాయ మహిళలపై కీచకపర్వం సాగించడం పరమ దుర్మార్గం. 18 నెలల పాలనలో ఆదివాసీ గూడేలపై 22 దాడులు జరగడం దారుణం. ఇదేనా కాంగ్రెస్ తెస్తానన్న మార్పు?

నిజమే. ఇదివరకటి బీఆర్ఎస్ పాలన ఎక్కడ? ఇప్పటి కాంగ్రెస్ పాలన ఎక్కడ? ఎంత తేడా. ఎక్కడి నుంచి ఎక్కడకు పడిపోయామని ప్రజలు వాపోతున్నారు. సుదీర్ఘకాలంగా తండాలు, గూడేలు కోరుకున్న స్వయంపాలన అవకాశాలు కల్పిస్తూ వాటిని గ్రామ పంచాయతీలుగా అభివృద్ధి చేసింది కేసీఆర్ ప్రభుత్వం. 'మావ నాటే మావ రాజ్' నినాదాన్ని నిజం చేసింది. జీవనాధారమైన పోడు భూముల సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తూ గిరిపుత్రులకు పట్టాలు పంపిణీ చేసి రికార్డు సృష్టించింది. 'మావ జమీన్.. మావ పట్టా' నినాదాన్ని సాకారం చేసి దేశానికే ఆదర్శంగా నిలిచింది. దేశవ్యాప్తంగా అటవీ హక్కుల చట్టం అమల్లోకి వచ్చాక ఏకకాలంలో నాలుగు లక్షల పైచిలుకు ఎకరాలకు పట్టాలు పంపిణీ చేయడం ఓ చరిత్ర. ప్రస్తుత కాంగ్రెస్ మంత్రి సీతక్క తల్లిదండ్రులు కూడా లబ్ధిదారుల్లో ఉండటం విశేషం. గిరిపుత్రులు ప్రశాంతంగా వ్యవసాయం చేసుకుని హాయిగా జీవిస్తారనే చల్లని తలంపుతో ఈ మార్పులు ప్రవేశపెట్టింది బీఆర్ఎస్ సర్కారు. అందుకు భిన్నంగా కాంగ్రెస్ సర్కారు గిరిజనులను వారికి ప్రాణసమానమైన భూమికి దూరం చేసేందుకు వికృత మార్గాలు అనుసరించడం దుర్మార్గం.

# బ్లాక్ వాటర్ అంటే ఏమిటి? ఈ నీటిని తాగడం వలన కలిగే ప్రయోజనాలు ఏమిటంటే..



సెలబ్రిటీల జీవితం గురించి తెలుసుకోవడానికి అభిమానులు చాలా ఉత్సాహాన్ని చూపిస్తారు. సెలబ్రేటీలు ఉదయం నిద్ర లేచింది మొదలు రాత్రి నిద్రపోయే వరకూ తినే ఆహారం, తాగే నీరు వరకూ ప్రతి విషయాన్ని తెలుసుకునేందుకు ఆసక్తిని చూపిస్తారు. చాలా మంది సెలబ్రిటీలు బ్లాక్ నీటిని తాగుతూ కనిపిస్తారు. అయితే ఈ బ్లాక్ నీటికి, సాధారణ నీటికి మధ్య తేడా ఏమిటో మీకు తెలుసా? ఇది ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తుందంటే? క్రికెటర్లు అయినా, బాలీవుడ్ స్టార్లు అయినా, సెలబ్రిటీలు తమ స్టైల్, ఫిట్‌నెస్, ఆహారపు అలవాట్లకు సంబంధించిన వార్తలతో చర్చల్లోనే ఉంటారు. ఎందుకంటే అభిమానులు సెలబ్రిటీల గురించి ప్రతిదీ తెలుసుకోవాలనుకుంటున్నారు. విరాట్ కోహ్లీ నుంచి శ్రుతి హాసన్ , మలైకా అరోరా వరకు ప్రతి ఒక్కరూ బ్లాక్ వాటర్ తాగడం చూస్తారు. నీరు మన దినచర్యలో ఒక ముఖ్యమైన భాగం. తద్వారా తాగే నీటిలో ఎటువంటి మలినాలు ఉండవు. సహజంగా లభించే నీటిలో కొన్ని ఖనిజాలు కూడా ఉంటాయి. ప్రస్తుతం బ్లాక్ వాటర్ సెలబ్రిటీలలో బాగా ప్రాచుర్యం పొందింది. బ్లాక్ వాటర్ సాధారణ నీటి కంటే ఎందుకు భిన్నంగా ఉంటుంది? ఈ రోజు ఆ విషయాలను తెలుసుకుందాం.

సెలబ్రిటీలు బ్లాక్ వాటర్ తాగుతారు. దీని రుచి దాదాపు సాధారణ నీటి మాదిరిగానే ఉంటుంది. అయితే ఈ నీటి ధర కొంచెం ఎక్కువగా ఉంటుంది. ఈ నల్ల నీళ్ళను ప్రత్యేకంగా చూపించేందుకు ఈ నీటిలో పోషక విలువలు వంటి అనేక కారణాలు ఉన్నాయి. ఈ నీళ్ళు తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయి. బ్లాక్ వాటర్ ప్రత్యేకత ఏమిటో తెలుసుకుందాం. స్థాయి తేడా సెలబ్రిటీలు త్రాగే బ్లాక్ వాటర్ ఆల్కలీన్ వాటర్. సాధారణ నీటి 6 నుంచి 7 మధ్య ఉన్నప్పటికీ.. ఈ బ్లాక్ వాటర్ 7 కంటే ఎక్కువగా ఉంటుంది. అంటే 8 లేదా 9. ఇది శరీరంలోని ఆమ్లత్వాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. కనుక ఈ వాటర్ ఆమ్ల సమస్యను కలిగించదు. ఇది మీ చర్మానికి కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. ఫిట్‌గా ఉండటానికి సహాయపడుతుంది. ఖనిజ లవణాలు ఎక్కువ కొన్ని ఖనిజాలు నీటిలో సహజంగా కనిపిస్తాయి. అయితే నీటిని ఫిల్టర్ చేసినప్పుడు.. కొన్నిసార్లు ఈ ఖనిజాలు నాశనమవుతాయి. బ్లాక్ వాటర్ లో అనేక ఖనిజాలను విడిగా కలుపుతారు. ఇవి శరీరానికి ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. బ్లాక్ వాటర్ వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏమిటంటే ఆల్కలీన్ బ్లాక్ వాటర్ తాగడం వల్ల శరీరం విషాన్ని తొలగిస్తుంది. దీని %జూ౧% స్థాయి శరీరం నుంచి విషాన్ని తొలగించడంలో సహాయపడుతుంది. సాధారణ నీటి కంటే బ్లాక్ వాటర్ శరీరాన్ని హైడ్రేట్ చేయడంలో ఎక్కువ సహాయపడుతుంది. దీనితో పాటు బ్లాక్ వాటర్ వల్ల రక్తంలో చక్కెర నియంత్రణ, మెరుగైన నిద్ర, హృదయ సంబంధ వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడం వంటి కొన్ని ఇతర ప్రయోజనాలు కూడా పరిగణించబడతాయి. ఎముకలు బలంగా ఉంటాయి. ఇది తెలుసుకోవడం ముఖ్యం బ్లాక్ వాటర్ ఎంత ప్రయోజనకరంగా ఉంటుందనే విషయంపై చాలా పరిమితమైన శాస్త్రీయ ఆధారాలు ఉన్నాయి. ఈ బ్లాక్ వాటర్ ఎటువంటి వ్యాధిని నయం చేయడంలో సహాయపడదు. ఆల్కలీన్, ఖనిజాల పరిమాణం కారణంగా ఈ నీటిని తాగడం ఆరోగ్యంగా ఉండటానికి ఒక ఎంపికగా మాత్రమే త్రాగవచ్చు. మీకు ఏదైనా ఆరోగ్య సమస్య ఉంటే, మీ ఆహారంలో బ్లాక్ వాటర్‌ను చేర్చుకునే ముందు, ఖచ్చితంగా వైద్యుడిని లేదా సర్టిఫైడ్ డైటీషియన్‌ను సంప్రదించండి.